తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice
వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
25-03-2026
బుధవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 58
PUBLISHED FROM HYDERABAD
పేజీలు-8 వెల:రూ.4 /—

## పెద్ది టీజర్ కోసం అభిమానుల ఆసక్తి

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న తాజా చిత్రం 'పెద్ది' పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాలో చరణ్ రఫ్ అండ్ మాస్ ప్రాతలో కనిపించబోతున్నాడు. ఇటీవల విడుదలైన ఈ సినిమా రెండో సింగిల్ 'రై రై రా రా' సోషల్ మీడియాలో సంచలనం సృష్టించగా.. ముఖ్యంగా రామ్ చరణ్ ఎనర్జిటిక్ డ్యాన్స్ మూమెంట్స్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. మరోవైపు ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది.

8



## మంత్రి పదవి ఇస్తే కాంగ్రెస్‌కే ప్రతిష్ఠ

- గతంలోనే హైకమాండ్ హామీ ఇచ్చింది
- మరోమారు మంత్రి పదవిపై పెదవి విప్పిన రాజగోపాల్

3



## దివ్యాంగులను మోసం చేసిన కాంగ్రెస్

- వారికి ఆరువేల పెన్షన్ హామీ ఏమయ్యింది
- దివ్యాంగులకు మద్దతుగా నేడు ఇందిరాపార్క్ వద్ద ధర్నా
- ప్రభుత్వం తీరుపై మండిపడ్డ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2





# పెరగనున్న లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలు

## 2029 ఎన్నికల నుంచి అమల్లోకి తెలంగాణ, ఏపీకి ఎన్నంటే?

- లోక్‌సభ, దేశంలోని అసెంబ్లీ స్థానాలకు 50 శాతం పెంచే యోచనలో కేంద్రం

**హైదరాబాద్,మార్చి24:**
లోక్‌సభ, దేశంలో అన్ని రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలను 50శాతం పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం లోక్‌సభ స్థానాలు 543 నుంచి 816కి పెరుగుతాయి. ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభ నియోజకవర్గాలు 263కు తెలంగాణలో 179కి చేరతాయి. నియోజకవర్గాల పునర్విభజన 2029 ఎన్నికల నుంచి అమల్లోకి వచ్చేలా బిల్లు తెచ్చేందుకు కేంద్రం సన్నద్ధమవుతోంది.
ఈ మేరకు బిల్లును ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే ప్రవేశపెట్టడానికి సిద్ధమైనట్లుగా సమాచారం. దీని ప్రకారం లోక్‌సభ స్థానాలు 543 నుంచి 816కి పెరుగుతాయి. దేశవ్యాప్తంగా 4,123 ఉన్న అసెంబ్లీ స్థానాలు 6,185కి చేరతాయి. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఉన్న 175 ఎమ్మెల్యే స్థానాలు 263కి, తెలంగాణలో ప్రస్తుత 119అసెంబ్లీ స్థానాలు 179కి పెరుగుతాయి. ఏపీలో లోక్‌సభ స్థానాలు 25 నుంచి 38కి, తెలంగాణలో 17 నుంచి 26కి చేరే అవకాశం ఉంది. ఈ విషయాన్ని సోమవారం సాయంత్రం జరిగిన ఎన్‌డీఏ సమావేశంలో భాగస్వామ్య పక్షాలకు కేంద్రం చెప్పినట్లుగా తెలుస్తోంది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, పార్లమెంటరీ వ్యవహారాలమంత్రి కిరణ్ రిజిజు,న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ నేతృత్వంలో ఈ సమావేశం జరిగింది. కాంగ్రెసేతర విపక్షాలతోను విడిగా సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్‌తోనూ అమిత్ షా మాట్లాడే అవకాశం ఉంది.

మిగతా 3వ పేజీలో..

## గ్యాస్ కొరతపై నిజాలు చెప్పండి

### అసెంబ్లీ గన్‌పార్క్ వద్ద బిఆర్ఎస్ ఆందోళన

**హైదరాబాద్,మార్చి24:**
రాష్ట్రంలో నెలకొన్న గ్యాస్ కొరతపై బీఆరఎస్ సభ్యులు నిరసన తెలిపారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ముందుగా గన్‌పార్క్ వద్దకు చేరుకున్న బీఆరఎస్ సభ్యులు గ్యాస్ సిలిండర్ల ప్లకార్డులతో నిరసన తెలిపారు. పెరిగిన ధరలపై ఆందోళన వ్యక్తం చేశారు. అవే ప్లకార్డులతో అసెంబ్లీకి బయల్దేరి వెళ్లారు. గ్యాస్ కొరత లేదని చెబుతూనే హోటళ్లు, చిరు వ్యాపారులకు

మిగతా 3వ పేజీలో..



## ఇవి వాహనాలపై 20శాతం డిస్కౌంట్

- పెద్ద ఎత్తున ఇవి ఛార్జింగ్ సెంటర్లు ఏర్పాటు
- ముందుకు వచ్చిన మహింద్రా తదితర కంపెనీలు
- రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్

3





2

## ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌కు బెదిరింపు మెయిల్

మోడీ,అమిత్ షా, జైశంకర్‌లను కూడా లేపేస్తామని హెచ్చరిక



2

## మతం మారితే ఎస్సీ హక్కులు కోల్పోతారు

- క్రిష్టియానిటిలో కుల వ్యవస్థ లేదు
- క్రిష్టియన్ మతం స్వీకరిస్తే ఎస్సీ,ఎస్టీ హక్కులు ఉండవు
- హిందువుల,సిక్కు, బౌద్ధ మత్‌స్థులకే కుల హక్కులు
- ఎపి హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీం కోర్టు



పార్టీ వీడొద్దని కోరిన మహేశ్ గౌడ్

## జీవన్‌రెడ్డితో ఫలించని

# పిసిసి చీఫ్ దౌత్యం

నిర్ణయం ఎవరి చేతుల్లోనూ లేదన్న జీవన్ రెడ్డి

తనను పార్టీలో కావాలనే దూరం పెట్టారన్న ఆవేదన

నేడు పార్టీ కార్యకర్తలతో భేటీకి పిలుపు

**జగిత్యాల,మార్చి24:**
తన పదేళ్ల ఒంటరి పోరును పార్టీ అధిష్ఠానం చిన్నచూపు చూసిందని మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తనకు పీసీసీ చీఫ్ పదవి రాకున్నా.. పార్టీ అధికారంలోకి వచ్చినందుకు సంతోషపడ్డానన్నారు. మంగళవారం జగిత్యాలలోని తన నివాసానికి పార్టీ అధిష్ఠానం పంపిన దూతలతో సమావేశమయ్యారు. ఈ సమావేశం అనంతరం జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. రాజకీయాల్లో తనది పూలబాట కాదని.. ముళ్ల బాట అని స్పష్టం చేశారు. పీసీసీ చీఫ్ కాబట్టి రేవంత్ రెడ్డికి

మిగతా 2వ పేజీలో..

## త్వరలో సాదాబైనామా పరిష్కారం

- కొనుగోలుదారు అఫ్ఫిడవిట్ ఇస్తే సరిపోతుంది
- దరఖాస్తుదారులకు మేలు జరిగేలా జీ.ఓ. 76
- శాసన మండలిలో మాత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

2



## క్షయవ్యాధిపట్ల ప్రజలు అప్రమత్తం అవసరం

- వ్యాధి లక్షణాలు గుర్తించి చికిత్స తీసుకోండి
- ప్రభుత్వం ఉచితంగా వైద్యం అందిస్తోంది
- నాపా ప్రతినిధుల అవేర్‌నెస్ కార్యక్రమం అభినందనీయం
- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

2





## దివ్యాంగులను మోసం

# చేసిన కాంగ్రెస్

- **వారికి ఆరువేల పెన్షన్ హామీ ఏమయ్యింది**
- **దివ్యాంగులకు మద్దతుగా నేడు ఇందిరాపార్క్ వద్ద ధర్నా**
- **ప్రభుత్వం తీరుపై మండిపడ్డ బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

హైదరాబాద్,మార్చి24:

దాదాపు ఆరున్నర, 7 లక్షల మంది దివ్యాంగులకు కాంగ్రెస్ పార్టీ చాలా వాగ్దానాలు ఇచ్చింది. 100 రోజుల్లోనే 6 వేల పెన్షన్ అని చెప్పింది. రూ.6 వేల పెన్షన్ ఇంకా ఎందుకివ్వడం లేదని ప్రభుత్వాన్ని బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. కేటీఆర్ దివ్యాంగులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తామని హామీనిచ్చింది. బ్యాక్ లాగ్ పోస్టుల విషయంలో, చదువుల విషయంలో కానీ చాలా చాలా వాగ్దానాలు వారి అభయహస్తం మేనిఫెస్టోలో చాలా వివరంగా ఇచ్చారు. అవన్నీ కూడా మా సోదరుల దగ్గర చాలా వివరంగా వారి ఫోన్లలో, వారి మనసుల్లో ముద్రించుకొని పోయి ఉన్నయి. తెల్లారి లేస్తే శారీరకంగా అవస్థలు పడే దివ్యాంగులు కోరుతున్నది ప్రత్యేకంగా కొత్తగా ఏం లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి. కాంగ్రెస్ పార్టీగా ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని వారు ఇవాళ అసెంబ్లీలోకి రావాలని ప్రయత్నం చేశారు. నేనడిగాను అసెంబ్లీలో లోపలికి రానీయండి.. మా లెసిస్లేచర్ పార్టీ ఆఫీస్‌లో కలుద్దాం. వారు బయట రోడ్డు మీద కలవటం కరెక్టు కాదు. కానీ వీళ్లంతా వస్తే మాకేదో ఇబ్బంది అయితది. వాళ్లను వద్దు అని చెప్పి పాసులు కూడా ఇయ్యకుండా సతాయిస్తే వారిని నడిరోడ్డు మీద కలవాల్సిన దుస్థితి ఈ రాష్ట్రంలో నెలకొందని కేటీఆర్ మండిపడ్డారు. దివ్యాంగుల గురించి కళ్లబొల్లి కబుర్లు చెప్పి ఓట్లు పొంది గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీని మేం ఈ బ్జడెట్ సెషన్‌లో అడుగుతాం.. నిలదీస్తాం. రూ.6 వేల పెన్షన్ ఇంకా ఎందుకివ్వడం లేదు. పక్క రాష్ట్రంలో రూ.6 వేల పెన్సన్ ఇస్తున్నరు. మీరు గద్దెనెక్కిన తర్వాత మూడో బ్జడెట్ ఇది 60 శాతం సమయం అయిపోయిన తర్వాత కూడా ఎందుకు ఇంకా డబ్బులు కేటాయించడం లేదు. నిలదీస్తాం. దీంతోపాటు దివ్యాంగులకు గతంలో మేం డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇచ్చి ఆదుకునే ప్రయత్నం చేసినం. ప్రతీ దాంట్లో కోటా పెట్టి వారిని ఆదుకునే ప్రయత్నం చేశాం. భవిష్యత్‌లో ఇంకా ఎక్కువ చేస్తాం. కానీ ఈ ప్రభుత్వం దివ్యాంగ సోదరసోదరీమణులకు ఇచ్చిన హామీలు అమలు చేసేదాకా వదిలిపెట్టమని కేటీఆర్ హెచ్చరించారు. నేడు ఇందిరాపార్క్ దగ్గర వాళ్లు రిలే నిరాహార దీక్షకు పిలుపునిచ్చారు దానికి కూడా మా మద్దతు ఉంటుంది. పార్టీ నాయకులం కూడా హాజరవుతాం. తప్పకుండా దాన్ని కూడా విజయవంతం చేయాల్సిందిగా దివ్యాంగ సోదరులను విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.



# మతం మారితే ఎస్సీ హక్కులు కోల్పోతారు

- **క్రిష్టియానిటిలో కుల వ్యవస్థ లేదు**
- **క్రిష్టియన్ మతం స్వీకరిస్తే ఎస్సీ,ఎస్టీ హక్కులు ఉండవు**
- **హిందువుల,సిక్కు, బౌద్ధ మత్‌స్థులకే కుల హక్కులు**
- **ఎపి హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీం కోర్టు**

న్యూఢిల్లీ,మార్చి24:

మతమార్పిడికి సంబంధించి సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. మతం మారిన ఎస్సీలకు ఆ హోదా ఉండదని స్పష్టం చేసింది. క్రిష్టియన్‌లోకి మారిన వారికి ఎస్సీ కింద లభించే వెసలుబాటు ఉండదని తేల్చింది. మతం మారితన తరవాత అట్రాసిటీ చట్టం కింద కేసులపై సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. క్రైస్తవంలోకి మారిన వారు ఎస్సీ హక్కులు పొందలేరని స్పష్టం చేసింది. హిందువులు, బౌద్ధులు, సిక్కులు మాత్రమే ఆ హక్కులు పొందుతారని పేర్కొంది. ఈ వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ చింతాడ ఆనంద్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపట్టి.. మంగలశారం తుది ఉత్తర్వులు జారీ చేసింది. బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెంలో పాస్టర్ చింతాడ ఆనంద్ ఎటువంటి అనుమతులు లేకుండా చర్చి నిర్వహించడంపై అక్కల రామిరెడ్డితో పాటు స్థానికులు అభ్యంతరం తెలిపారు. వారిపై అట్రాసిటీ నిరోధక చట్టం కింద ఆనంద్ కేసు పెట్టారు. ఆ కేసును కొట్టివేయాలంటూ రామిరెడ్డి, స్థానికులు ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. చింతాడ ఆనంద్ పాస్టర్‌గా పనిచేస్తుండటంతో క్రైస్తవుడవుతారని.. రాజ్యాంగం ప్రకారం షెడ్యూలు కులాలకు సంబంధం ఉండదని రామిరెడ్డి తరపు న్యాయవాదులు వాదనలు వినిపించారు. పుట్టుకతో హిందువు అయినా.. క్రైస్తవం స్వీకరించడంతో ఆనంద్ షెడ్యూల్ కులానికి చెందరని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అట్రాసిటీ చట్టంలోని సెక్షన్లు ఆయనకు వర్తించవని, ఫిర్యాదు చట్ట వ్యతిరేకమని.. తమపై పెట్టిన కేసుకు విచారణార్హత లేదని వాదించారు. రామిరెడ్డి తరపు న్యాయవాదుల వాదనలను హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది. క్రైస్తవ మతంలో కులవ్యవస్థ లేదని పేర్కొంది. హిందూ, సిక్కు, బౌద్ధ మతాలకు చెందిన వారికే ఎస్సీ హక్కులు పొందే అర్హత ఉంటుందని స్పష్టం చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఆనంద్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దీనిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ అంజరియా ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఏపీ హైకోర్టు తీర్పును సమర్థించింది. హిందూ, బౌద్ధ, సిక్కు మతాల్లోని వారు మాత్రమే ఎస్సీ హోదాకు అర్హులని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అలా కాకుండా మతం మారితే ఎస్సీ హోదా రద్దవుతుందని తేల్చి చెప్పింది. క్రైస్తవ మతంలోకి మారి పాస్టర్‌గా పని చేస్తున్న వ్యక్తి ఎస్సీ, ఎస్టీ చట్టం కింద రక్షణ పొందలేరని స్పష్టం చేసింది. పాస్టర్ ఆనంద్ దశాబ్దానికి పైగా క్రైస్తవంలో ఉన్నారని.. తిరిగి మారలేదని నిరూపణ అయిందని ధర్మాసనం పేర్కొంది.

# క్షయవ్యాధిపట్ల ప్రజలు అప్రమత్తం అవసరం

హైదరాబాద్,మార్చి24:

క్షయవ్యాధిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హెచ్చరించారు. ఇది సమాజానికి పట్టిన చీడ అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు క్షయవ్యాధిన ఇవారణకు అనేక చర్యలు తీసుకుంటున్నా.. మళ్లీ ఇది విజృంబిచడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. క్షయ లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం ఉచిత వైద్యం అందిస్తోందని అన్నారు. అంతర్జాతీయ క్షయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంత్రి మాట్లాడారు. అనుమానం ఉన్న ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలన్నారు. లేకుంటే ఒకరి నుంచి మరొకరికి ఇది వ్యాప్తి చెంది సమాజానికి సవాల్ చేయగలదన్నారు. ఇదిలావుంటే హైదరాబాద్‌లో యువ పల్మనాలజిస్టులు



చేపట్టిన చైతన్య కార్యక్రమాన్ని మంత్రి అభినందించారు. ప్రతి ఒక్కరూ ఇలా చైతన్యం చేయడానికి ముందుకు రావాలన్నారు. ఈ క్రమంలో సామాజిక బాధ్యతగా గుర్తించిన యువ వైద్యులు ఓ బృందం ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు, చైతన్యం చేయడానికి పూనుకున్నారు. హైదరాబాద్ నగరంలో పెద్ద ఎత్తు ప్రచార కార్యక్రమాలకు దిగారు. మంగళవారం ప్రపంచ టిబి దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల్లో చైతన్యం కోసం వాకథాన్ నిర్వహించారు. ఆదివారం సంజీవయ్యపార్క్‌లో నిర్వహించిన వాకథాన్‌తో పాటు మంగళవారం కెబిఆర్ పార్క్‌లో కూడా దీనిని నిర్వహించారు. న్యూ ఏజ్ పల్మనాలజిస్ట్స్ అసోసియేషన్ కోర్ కమిటీ నాపా ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టింది. ఇందులో ప్రముఖ పల్మనాలజిస్టు డాక్టర్లు డా. అంకిత్ కోట్ల, డా. వివేక్ వర్ధన్ వీరపనేని,డా. బి. అనిరుధ్,డా. రోహిత్ రెడ్డి,డా. గోవర్ధన్ రెడ్డి, డా. కె. ప్రశాంత్ ,డా. ఉపేంద్ర, డా. ఓబుల్ రెడ్డిలు ఉన్నారు. వీరంతా కలసి ఈకార్యక్రమం ద్వారా ప్రజాచైతన్యం కోసం వాకథాన్ మంగళవారం కెబిఆర్ పార్క్ వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సీనియర్ పల్మనాలజిస్టు డాక్టర్లు డా. విష్ణున్ రావు వీరపనేని, డా. సుధాకర్ కంది,డా. టిఎలఎన్ స్వామి,డా. దయానంద్ తదితరులు పాల్గొన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రపంచవ్యాప్తంగా 18 లక్షల మరణాలతో 1.04 కోట్ల కొత్త కేసులు నమోదైనవి అని నివేదించిందని అన్నారు. అవగాహనను పెంచడానికి, ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని 1982 నుండి ప్రతి సంవత్సరం మార్చి 24న జరుపుకుంటున్నామని అన్నారు. తమ బాధ్యతగా నాపా ప్రతినిధులంతా కలసి ప్రజలను చైతన్యం చేసేందుకు ముందుకు వచ్చామని నాపా ప్రతినిధి డాక్టర్ వివేక వర్ధన్ వీరపనేని అన్నారు. ప్రజలు అప్రమత్తం కావలని, సకాలంలో వైద్యుల సలహాలు తీసుకుని, చికిత్సకు సిద్ధం కావాలని వీరంతా సూచించారు.

# త్వరలో ‘సాదాబైనామా‘ పరిష్కారం

- **కొనుగోలుదారు అఫ్డిడవిట్ ఇస్తే సరిపోతుంది**
- **దరఖాస్తుదారులకు మేలు జరిగేలా జీ.ఓ. 76**
- **శాసన మండలిలో మాత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

హైదరాబాద్,మార్చి24:

రాష్ట్రంలో 2020 నుంచి పెండింగ్ లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులను వీలైనంత త్వరితగతిన పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ, ఆనాటి బి.ఆర్.ఎస్. ప్రభుత్వం సాదబైనామాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించిందని, కానీ 2020 ఆర్.ఓ.ఆర్. చట్టంలో పరిష్కారం మార్గం చూపించలేదన్నారు. భూభారతి చట్టంలో ఈ సమస్యకు పరిష్కారం చూపించడం జరిగిందని, అయితే కొనుగోలుదారు అమ్మకందారు ఇద్దరి నుంచి అఫ్డిడవిట్ తీసుకోవాలన్న నిబంధనను పొందుపరచడం వల్ల క్షేత్రస్థాయిలో సమస్యలు ఎదురవుతున్నా



యి. వీటిని దృష్టిలో పెట్టుకొని కొనుగోలుదారు నుంచి మాత్రమే అఫిడవిట్ తీసుకోవాలని నిర్ణయించామని, ఈ మేరకు జీ.ఓ. 76ను విడుదల చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో 9 లక్షలకు పైగా దరఖాస్తును పెండింగ్ లో ఉన్నాయని, వీటన్నింటికీ పరిష్కారం లభించబోతుందని తెలిపారు.నక్షా లేని 413 గ్రామాలకు గాను 5 గ్రామాలల్లో ప్రయోగాత్మకంగా రీ సర్వే నిర్వహించామని, ఇందులో ప్రతీ సర్వే నెంబర్ కు ఆధార్ నెంబర్ మాదిరిగానే భూధార్ కేటాయించడం జరిగిందని అన్నారు. త్వరలో హైదరాబాద్ మినహా 32 జిల్లాల్లో ప్రతీ జిల్లలో 70 గ్రామాల్లో భూ సర్వే నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందని తెలిపారు. దశల వారిగా భూ సర్వే నిర్వహించి భూధార్ ను ఇస్తామని, రాష్ట్రం లోని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని చేలిపారు. ధరణి పోర్టల్ లోని లోసగులను ఆసరాగా చేసుకొని కొంత మంది మీ 'సేవ నిర్వాహకులతో కలిసి 3.99 కోట్ల రూపాయల ప్రభుత్వ సొమ్మును కాజేశారని, దీనిపై ఉన్నత స్థాయి కమిటీతో విచారణ జరిపించామని తెలిపారు. తప్పుచేసిన వారి నుంచి ఆ సొమ్మును రికవరీ చేస్తామని ప్రకటించారు. ఇందులో అధికారుల పాత్ర ఉంటే ఏ స్థాయిలో ఉన్నా కూడా ఉపేక్షించబోమని తెలిపారు. శాసన మండలిలో సభ్యులు తాతా మధుసుదన్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఆనాడు ధరణి పోర్టల్ ను నాలుగు గోడల మధ్య ప్రజల అభిప్రాయాలకు వ్యతిరేకంగా అర్ధరాత్రి తీసుకొచ్చారని, దీని వల్లే కొత్తగా భూ సమస్యలు పుట్టుకొచ్చాయని విమర్శించారు. ధరణి పోర్టల్ లో 40, 41 మాడ్యుల్స్ ఉంటే భూ భారతి పోర్టల్ లో 6 కు కుదించామని, ధరణి పోర్టల్ ను అర్ధరాత్రి ఒక్క రోజు మార్చేది కాదని, దశలవారీగా మార్పులు చేసుకుంటూ వస్తున్నామని, ఈ ఏప్రిల్ చివరి నాటికి పూర్తి స్థాయిలో భూ భారతి పోర్టల్ ను తెస్తామని తెలిపారు.



## ప్రజల దృష్టి మరల్చేందుకే ఫార్ములా ఈ `కార్ రేస్ కేసు

- **ఫార్ములా రేస్‌లో న్యాయస్థానంలో పోరాడుతాం**
- **అందాల పోటీలతో సాధించిందేమిటో చెప్పాలి: కెటిఆర్**

హైదరాబాద్,మార్చి24:

ప్రజల దృష్టి మరల్చేందుకే ఫార్ములా ఈ `కార్ రేస్ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేశారని బీఆరఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ఎవరికి అనుచిత లబ్ది చేకూర్చామని ఆరోపిస్తున్నారో.. వారి పేరే లేదని చెప్పారు. ఈ కేసులో న్యాయపోరాటం చేస్తామని.. న్యాయస్థానాలపై సంపూర్ణ విశ్వాసం ఉందన్నారు. రూ.200 కోట్లతో నిర్వహించిన మిస్‌వరల్డ్ పోటీలతో రాష్టానికి ఎన్ని పెట్టుబడులు వచ్చాయి? అని ప్రశ్నించారు. ఎన్ని చేసినా ఆరు గ్యారంటీలు అమలు చేసేవరకు పోరాడతామన్నారు. ‘ఈ కేసులో ఏమీ లేదని ఛార్జిషీట్‌లో ప్రభుత్వం మళ్లీ అంగీకరించింది. మేం కట్టింది రూ.45 కోట్లయితే.. రూ.500 కోట్లు, రూ.600 కోట్లు అని చెబుతున్నారు. విధానపరమైన లోపం ఉన్నట్లుందని ఛార్జిషీట్ ద్వారా తెలుస్తోంది. తప్పు జరిగితే.. బ్యాంకు ఖాతాలోని డబ్బును ఎందుకు రికవరీ చేయలేదు? ఈ కేసులో ఏమీ లేదని నేను మొదట్నుంచీ చెబుతున్న విషయాన్ని ప్రభుత్వం ధ్రువీకరించింది. ఎలక్ట్రిక్ వాహనాల విషయంలో హైదరాబాద్‌ను ప్రపంచపటంలో పెట్టేందుకు చేసిన ప్రయత్నమే ఫార్ములా ఈ `కార్ రేస‘ అని కేటీఆర్ పేర్కొన్నారు.

# ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌కు బెదిరింపు మెయిల్

- **మోడీ,అమిత్ షా,జైశంకర్‌లను కూడా లేపేస్తామని హెచ్చరిక**
- **ఢిల్లీ మెట్రో, అసెంబ్లీ లకు బాంబు బెదరింపులు**

న్యూఢిల్లీ,మార్చి24:

దేశంలోని ప్రముఖులను హతమారుస్తామంటూ ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ విజేందర్ గుప్తాకు ఒక బెదిరింపు ఈ మెయిల్ వచ్చింది. దీంతో ఈ అంశంపై భద్రతా సిబ్బంది, అధికారులు దృష్టిసారించి తగిన చర్యలు చేపట్టారు. మంగళవారం తనకు బెదిరింపు మెయిల్ వచ్చిందని స్పీకర్ విజేందర్ గుప్తా అధికారులకు తెలిపారు. దేశంలోని ప్రముఖులను హతమారుస్తామని పేర్కొంటూ ఆ మెయిల్ వచ్చింది. అందులో ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జై శంకర్, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, ఢిల్లీ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తరంజిత్ సింగ్ సందు వంటి ప్రముఖుల పేర్లు ఉన్నాయి. అలాగే ఢిల్లీ అసెంబ్లీ, విధాన సభ మెట్రో స్టేషన్‌లకు కూడా బాంబు బెదిరింపు వచ్చింది. దీనిపై సమాచారం అందుకున్న భద్రతా సిబ్బంది, అధికారులు వెంటనే అసెంబ్లీ, విధాన సభ మెట్రో స్టేషన్లలో బాంబ్ స్క్వాడ్‌తో, డిస్పోజబుల్ టీమ్స్‌తో తనిఖీలు చేపట్టారు. అసెంబ్లీ ప్రాంగణం, మెట్రో స్టేషన్ పరిసరాల్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఈ ప్రాంతం మొత్తం హై అలర్ట్ కొనసాగిస్తున్నారు. అయితే, ఇలాంటి బెదిరింపులు రావడం సహజమే అని, అలాగని వాటిని తేలిగ్గా తీసుకోలేమని, అందుకే భద్రతను కట్టుదిట్టం చేశామని ఢిల్లీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ మోహన్ సింగ్ బిష్ట్ అన్నారు.



ఈ బెదిరింపులపై తామేమీ భయపడటం లేదని, అసెంబ్లీ సమావేశాలు యథావిధిగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. పరిస్థితి అదుపులోనే ఉందని, భద్రత విషయంలో ఎలాంటి ఆందోళనా అవసరం లేదని బీజేపీ ఎమ్మెల్యేలు అన్నారు. ఇక ఢిల్లీ అసెంబ్లీలో బ్జడెట్ ప్రవేశపెడుతున్న సందర్భంగా సీఎం రేఖా గుప్తా కూడా అసెంబ్లీకి చేరుకున్నారు. బెదిరింపు ఈ మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందో తెలుసుకునేందుకు అధికారులు ఆరాతీస్తున్నారు.

# జీవన్‌రెడ్డితో ఫలించని పిసిసి చీఫ్ దౌత్యం

మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రి, సీఎల్పీ లీడర్ కాబట్టి భట్టి విక్రమార్కకు డిప్యూటీ సీఎం పదవి ఇచ్చారన్నారు. కానీ తాను శాసన మండలిలో నేతను అని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి గుర్తు చేశారు. మరి తనకెందుకు అన్యాయం చేశారంటూ కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలను ఈ సందర్భంగా జీవన్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపుల్లో మనకు బీఆరఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆదర్శం కాదు కదా? అంటూ కాంగ్రెస్ నేతలకు ఆయన చరకలంటించారు. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచనలు ఏమిటి? మనం చేస్తున్నదేమిటంటూ రాష్ట్రంలోని పార్టీ నేతలను ఈ సందర్భంగా ఆయన సూటిగా నిలదీశారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ వంటి నేతలు ఇచ్చిన హామీ అమలు కాకపోతే పార్టీ ఎందుకంటూ జీవన్ రెడ్డి ఈ సందర్భంగా కొంత అసహనం వ్యక్తం చేశారు. అధిష్ఠానం తనను బుజ్జగించలేదని చెప్పారు. తాను పార్టీ వీడి వెళ్తున్నానని తెలిసి.. అలా వచ్చి వెళ్లారంటూ కాంగ్రెస్ ప్రతినిధుల రాకపై జీవన్ రెడ్డి స్పందించారు.కాంగ్రెస్ పార్టీని వీడొద్దని మాజీ మంత్రి జీవన్‌రెడ్డిని కోరామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. జగిత్యాలలో జీవన్‌రెడ్డితో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సాకేవత్‌తో కలిసి ఆయన సమావేశమయ్యారు. సుదీర్ఘమైన రాజకీయ చరిత్ర,



43 ఏళ్ల అనుభవం ఉన్న నాయకుడు జీవన్‌రెడ్డి. ఆయన మాకు తండ్రిలాంటివారు. రాజకీయాల్లో ఆయన సీనియర్ నేత. జీవన్‌రెడ్డిని కొన్ని ఇబ్బందులకు గురయ్యారు. కాంగ్రెస్ పార్టీ ఆయన్ను వదలుకోదలచుకోలేదు. పార్టీ వీడే అంశంలో పునరాలోచన చేయాలని కోరాం అని మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. జగిత్యాలలో జీవన్ రెడ్డితో పీసీసీ అధ్యక్షులు మహేష్ భేటీ ముగిసింది. పార్టీలో కొనసాగండి, పార్టీని వీడకండి. భవిష్యత్తుపై చర్చిద్దామని పీసీసీ చర్చలు జరిపారు. ఏఐసీసీ నాయకులు సైతం పార్టీలోనే కొనసాగాలని జీవన్ రెడ్డిని కోరారు. భేటీ అనంతరం మహేష్‌గౌడ్ మాట్లాడారు. ‘జీవన్ రెడ్డి మా తండ్రి సమానులు. 43 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఆయనది. రాష్ట్రంలో అంతకన్నా సీనియర్ నాయకులు లేరు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కొంత ఇబ్బంది పడ్డారు. ఈ వయసులోనూ ఇబ్బంది పడ్డారు. కొన్ని సార్లు రాజకీయంలో అనుకోని నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది. జీవన్‌రెడ్డి ఇబ్బందుల్లో ఉన్నారు కాబట్టి నా సూచనల మేరకు మంత్రి శ్రీధర్ బాబు వచ్చారు. నేను కూడా ఈ రోజుల కలిశాను. కాంగ్రెస్‌తో అనుబంధాన్ని తెంచొద్దని, మమ్మల్ని వీడొద్దని వారికి విన్నవించడం జరిగింది. కార్యకర్తల ఒత్తిడి తదితర కారణాల వల్ల వారు ఈ నిర్ణయం తీసుకుంది. వారు పార్టీలోనే ఉండాలని ఏఐసీసీ పట్టుబడుతోంది. నాకు జీవన్‌రెడ్డితో 1986 నుంచి పరిచయం. అప్పటి నుంచి మాకు రాజకీయంగా సలహాలు ఇచ్చారని తెలిపారు. జీవన్ రెడ్డి రాజీనామా చేయరు అనే ఆశతో ఇక్కడి నుంచి వెళ్తున్నామని మహేష్‌కుమార్ గౌడ్ చెప్పారు.అయితే వారు ఎలాంటి హామీఇవ్వలేక పోయారు. దీంతో ఆయనకు సూచనలు చేసి వెనుదిరిగారు. పార్టీ మారడామా లేదా అన్నది కూడా తన చేతిలో లేదని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి వ్యాఖయానించారు. ఇప్పటికే శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్‌లు ఓమారు జీవన్ రెడ్డితో భేటీ అయ్యారు. ఇక ఈ భేటీ అనంతరం ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. ఈ చర్చలు ఫలించలేదు. జీవన్‌రెడ్డి ఇంటిపై ఉన్న కాంగ్రెస్ ఫ్లెక్సీని అభిమానులు తొలగించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఇది పరిష్కారం లేని సమస్యగా మారింది.. సమస్యకు పరిష్కారం నా దగ్గర లేదు.. వారి దగ్గర కూడా లేదు. రేపు 10 గంటలకు కార్యకర్తలు అందరు భేటీ అవ్వండి. గార్డెన్‌కి రండి.. రేపు భవిష్యత్తు, పయనం ఎలా ఉంటుందో తెలియదు.. కాంగ్రెస్ పార్టీలో ఉండి స్వపక్షంతో యుద్ధం నేను చేయలేను. నేను నా నిర్ణయం రేపు ప్రకటించబోతున్న.. నా నిర్ణయం దైవ నిర్ణయంగా భావిస్తున్నా.‘ అని జీవన్‌రెడ్డి తెలిపారు. ఇక కాంగ్రెస్‌కు రేపు జీవన్‌రెడ్డి రాజీనామా చేయనున్నట్లు తెలుస్తోంది.

# మంత్రి పదవి ఇస్తే కాంగ్రెస్‌కే ప్రతిష్ట

- గతంలోనే హైకమాండ్ హామీ ఇచ్చింది
- మరోమారు మంత్రి పదవిపై పెదవి విప్పిన రాజగోపాల్



**హైదరాబాద్,మార్చి24:**
కాంగ్రెస్ హైకమాండ్ తనకు మంత్రి పదవి ఇస్తామని గతంలో హామీ ఇచ్చిందని ఆ పార్టీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి గుర్తు చేశారు. తనకు పదవి ఇవ్వడం ద్వారా కాంగ్రెస్ ప్రతిష్ఠ పెరుగుతుందని అన్నారు. మీడియాతో చిట్‌చాట్‌లో కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. తనకు గతంలో హామీనిచ్చిన అధిష్టానం ఇపుడు ఏం చేస్తుందో తెలియదన్నారు. నేను మంత్రి పదవి కోసం పాకులాడడం లేదు. ఏ పదవి లేకున్నా రాజగోపాల్ రెడ్డికి ప్రజల్లో తగిన గౌరవం ఉంటుందన్నారు. నాకు మంత్రి పదవి ఇస్తే కాంగ్రెస్ పార్టీకి, రాష్ట్ర ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందని రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే నా లాంటి తెలంగాణ ఉద్యమకారుల సేవలు అవసరమన్నారు. తనకు రేవంత్ రెడ్డితో ఎలాంటి ఇబ్బంది లేదని.. నిన్న ముఖ్యమంత్రితో ప్రత్యేక భేటీ లేదు, ఎదురుపడితే పలకరించుకున్నామని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. ఇవాళ కేటీఆర్‌తో కూడా సాధారణంగా అన్ని విషయాలపై మాట్లాడానన్నారు.మంత్రి పదవి ఇస్తామని కాంగ్రెస్ అధిష్ఠానం గతంలో కూడా హామీ ఇచ్చిందని వ్యాఖ్యానించారు. హై కమాండ్ ఇప్పుడు ఏం చేస్తుందో తెలియదని చెప్పుకొచ్చారు. తాను మంత్రి పదవి కోసం పాకులాడటం లేదని పేర్కొన్నారు. ఏ పదవి లేకున్నా తనకి ప్రజల్లో తగిన గౌరవం ఉంటుందని స్పష్టం చేశారు. తనకు మంత్రి పదవి ఇస్తే కాంగ్రెస్‌కి, రాష్ట్ర ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చెప్పారు. కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే తన లాంటి తెలంగాణ ఉద్యమకారుల సేవలు అవసరమని తెలిపారు. తనకు సీఎం రేవంత్‌రెడ్డితో ఎలాంటి ఇబ్బంది లేదని క్లారిటీ ఇచ్చారు. నిన్న సీఎంతో ప్రత్యేకంగా ఏం భేటీ లేదని, ఎదురుపడితే పలకరించుకున్నామని చెప్పారు. మాజీమంత్రి కేటీఆర్‌తో ఇవాళ కూడా సాధారణంగా అన్ని విషయాలపై మాట్లాడానని వివరించారు. 2018 ఎన్నికల్లో 88 సీట్లు వచ్చిన తర్వాత కూడా 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తీసుకోవడం తప్పని కేటీఆర్‌కు చెప్పానని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

# ఇవి వాహనాలపై 20శాతం డిస్కౌంట్

- పెద్ద ఎత్తున ఇవి ఛార్జింగ్ సెంటర్లు ఏర్పాటు
- ముందుకు వచ్చిన మహింద్రా తదితర కంపెనీలు
- రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్




**హైదరాబాద్,మార్చి24:**
హైదరాబాద్ నగరంలో వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అందుకోసం ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ) తీసుకువస్తున్నట్లు తెలిపారు. రూ.1000 కోట్ల ఆదాయం నష్టమైనా ఈవీ వాహనాలు తీసుకొస్తున్నామని వివరించారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ విలేకర్లతో మాట్లాడుతూ.. కాలుష్యాన్ని నివారించాలనే ఉద్దేశ్యంతోనే ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చామన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో పని చేస్తున్న ఉద్యోగులకు ఈవీ వాహనాలపై 20 శాతం డిస్కౌంట్ ఇస్తున్నామని ప్రకటించారు. తెలంగాణ కాలుష్య రహిత రాష్ట్రంగా ఉండాలని ప్రయత్నిస్తున్నామని.. అందుకోసం ఈ ప్రయత్నం తీసుకువచ్చామని మంత్రి పొన్నం తెలిపారు. ఈవీ ఆటోలతోపాటు బస్సులను సైతం తీసుకుని వస్తున్నామన్నారు. నగరాన్ని క్యూర్ చేయాలని ఈ కార్యక్రమం చేపట్టామని వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో ఈవీ వాహనాలకు సబ్సిడీ ఇస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. దేశంలోని వివిధ ప్రధాన నగరాలు.. తీవ్ర కాలుష్యంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. వాహనాల నుంచి వెలువడే కాలుష్యం వల్లే ఈ విధంగా తయారవుతున్నాయని ఇప్పటికే పలు అధ్యాయనాల ద్వారా వెల్లడైంది. ఈ నేపథ్యంలో వాహన కాలుష్యాన్ని అరికట్టేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రజా పాలన ప్రభుత్వం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిరు ఢిల్లీ లాగ హైదరాబాద్ కాలుష్యం కావద్దని ఉద్దేశ్యంతో ఈవీ పాలసీ తీసుకొచ్చిందన్నారు. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రభుత్వం ఈవి పాలసీ తీసుకొచ్చింది..ఈవీ పాలసీ తో జీరో రోడ్ టాక్స్ ,జీరో రిజిస్ట్రేషన్ టాక్స్ మినహాయింపు ఉంటుంది.. దాని ద్వారా దాదాపు వెయ్యి కోట్లు ప్రభుత్వం నష్టపోయిన ఈవీ పాలసీ నీ ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది..ఈవి పాలసీ వచ్చిన తర్వాత ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం భారీగా పెరిగింది.. అందువల్ల ఇటీవల రవాణా శాఖ సమీక్షా సమావేశం లో ప్రభుత్వం ఉద్యోగులకు ప్రోత్సాహం ఇవ్వాలని తయారీ దారులను కోరడం జరిగింది.ప్రభుత్వ సంస్థలకు , హైర్ లేదా డిపార్ట్ మెంట్ లు కొనుగోలు చేస్తే ఈవీ వాహనాలు కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు..ఈవి వాహనాలకు అన్ని ప్రాంతాల్లో ఈవి ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం జరిగింది..కంపెనీ దారులు ప్రభుత్వ ఉద్యోగులకు 10`20 శాతం వారు డిస్కౌంట్ ఇస్తారు.. మహేంద్ర ఎలెక్ట్రిక్స్, ఆథర్ ఎనర్జీ, గ్రావిటన్ మోటార్స్,ఓలా తో పాలు పలు కంపెనీలు ముందుకు వస్తున్నాయి..క్యూర్ ఏరియా లో ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయి.. క్యూర్ ఏరియా లో డీజిల్ ఆటో లు కూడా రిట్రైరోఫిట్ గా మార్చి నడపాలని నిర్ణయం తీసుకుంది.. రెడ్కో ద్వారా కూడా ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం జరుగుతుంది.. ఆర్థిక మంత్రికి శాసన మండలి లో చెప్పడం జరిగింది.. ప్రజా ప్రతినిధులు ఈవి వాహనాలకు లోన్ తీసుకునేలా చెప్పడం జరిగింది.. ముందుగా ఉద్యోగులకు ప్రథమ పౌరుడు సిఎస్ ,ఉద్యోగ సంఘాల నాయకులు ఈవీ వాహనాన్ని బుక్ చేసుకుంటున్నారని మంత్రి తెలిపారు.15 సంవత్సరాలు దాటిన వాహనాలు పేజీ కి పంపిస్తున్నాం.. రవాణా శాఖ లో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నాం.. తెలంగాణ లో నిన్న వాహన్ పోర్టల్ లోకి చేరాం.. వాహనాన్ని కొనుగోలు చేసినప్పుడు షో రూమ్ లోనే రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి చేరాలంటే ఉద్యోగులే వారధిగా ఉంటారని అన్నారు.




# గ్యాస్ కొరతపై నిజాలు చెప్పండి

మొదటిపేజీ తరువాయి
వాణిజ్య సిలిండర్ల సరఫరాను నిలిపివేయడంపై బీఆరఎస్ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్యాస్ కొరత కారణంగా సాధారణ ప్రజానీకంతో పాటు చిరు వ్యాపారులు, హోటల్ వ్యాపారంపై ఆధారపడిన లక్షలాది మంది ఉపాధికి తీవ్ర విఘాతం కలిగిందని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి గ్యాస్ సరఫరా సంక్షోభంపై ప్రజలకు నిజాలు చెప్పాలని డిమాండ్ చేశారు. యుద్ధం ప్రారంభమయ్యాక ఎల్‌పీజీ సిలిండర్ల కోసం గ్యాస్ ఏజెన్సీల వద్ద చాంతాడంత లైన్లు కనిపిస్తున్నాయని బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ తెలిపారు. గ్యాస్ కొరత లేదని కేంద్ర ప్రభుత్వం ప్రజలకు నమ్మబలుకు తోందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం గ్యాస్ కొరత తీవ్రంగా ఉందని చెప్పారు. రాష్ట్రంలో నెలకొన్న గ్యాస్ కొరతపై బీఆరఎస్ సభ్యులు నిరసన తెలిపారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ముందుగా గన్‌పార్క్ వద్దకు చేరుకున్న బీఆరఎస్ సభ్యులు గ్యాస్ సిలిండర్ల ప్లకార్డులతో నిరసన తెలిపారు. పెరిగిన ధరలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కేంద్రం ఆధీనంలో పెట్రోలియం శాఖ ఉందని.. తామేమీ చేయలేమని రాష్ట్ర ప్రభుత్వం అంటోందని కేటీఆర్ అన్నారు. ఫ్యూచర్‌లో గ్యాస్ సిలిండర్ల సైజ్ తగ్గిస్తారనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయిని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సామాన్యులను ఇబ్బంది పెడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆంబోతుల కొట్లాటలో లేగలు బలైనట్లుగా సామాన్యుల పరిస్థితి ఉందని అన్నారు. యుద్ధం కారణంగా గ్యాస్ కొరత చర్చనీయాంశంగా మారిందని తెలిపారు. కొరత లేదని కేంద్రం, సప్లయి లేదని రాష్ట్రం ప్రజలను మభ్యపెడుతున్నాయని విమర్శించారు. గ్యాస్ కొరత లేకుండా కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# జిహెచఎంసి అభివృద్ధికి ప్రణాళికలు

- రూ.15 వేల కోట్లు నిధులు మంజూరు
- మేడ్చెల్ అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్న మల్లారెడ్డి
- అసెంబ్లీలో సమాధానం ఇచ్చిన మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్,మార్చి24(ఆరఎనఎ):బిఆరఎస్ ప్రభుత్వం మొదలు పెట్టిన పనులకు తాము నిధులు మంజూరు చేశామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. మున్సిపల్ శాఖ అభివృద్ధికి సంబందించి.. సిఎం రేవత్ రెడ్డి ఓ ప్రణాళికను తీసుకున్నారని అన్నారు. అసెంబ్లీలోలో సభ్యులు అడిగిన ప్రశ్నల సందర్భంగా శ్రీధర్ బాబు మున్సిపల్ శాఖ అభివృద్ధికి సంబందించిన విషయంపై మాట్లాడారు. జిహెచఎంసి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు నిధులు మంజూరు చేశామని, రూ. 122 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని ఎమ్మెల్యేలు చెప్పారని తెలియజేశారు. 2016 లో ఎసఆర్ డిపిని తీసుకువచ్చారని, ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులు చేస్తున్నామని అన్నారు. 15 రోజుల్లో పనులు ప్రారంభిస్తామని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. జవహర్ నగర్ ప్రాంతం తన గుండెకాయ అని మంత్రి చామకూర మల్లారెడ్డి తెలిపారు. హైదరాబాద్ చెత్త అంత అక్కడే వేస్తున్నారని అన్నారు. జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై ఆయన ప్రస్తావించారు. ఇన్ చార్జి మంత్రి శ్రీధర్ బాబు అంటే తనకు చాలా అభిమానం అని తెలియజేశారు. చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్ బిఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ హయాంలో ఏర్పాటు చేశారని, మేడ్చల్ నియోజకవర్గాన్ని అతలాకుతలం చేశారని విమర్శించారు. జవహర్ నగర్ చెత్తతో రెండున్నర లక్షల మంది అవస్థలు పడుతున్నారని, వాసన భరించలేకపోతున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యేగా ఎందుకు గెలిచానా అని అనిపిస్తుందని, తనపై కుట్ర పన్నుతున్నారని మల్లారెడ్డి ధ్వజమెత్తారు. మేడ్చల్ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించాలని అన్నారు. మేడ్చల్ ప్రాంతాన్ని జీహెచఎంసీ పరిధిలోకి తీసుకొచ్చారు. కానీ, కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ మోరీలు, కరెంటు స్తంభాలు లేవు. జవహర్‌నగర్‌లో చెత్త కొండ పేరుకుపోతోంది. వాతావరణ కాలుష్యంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్రీధరన్నా మీకు దండం పెడతా. మాపై పగపట్టకండి. దయచేసి మేడ్చల్ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించండి‘ అని మల్లారెడ్డి కోరారు. అలాగే గత పదేళ్లుగా రోడ్లు, డ్రైనేజీలు లేవని వ్యాఖ్యానించారు. దీనిపై శ్రీధర్ బాబు స్పందించారు. నిజాలు చెప్పినందుకు మల్లారెడ్డిని అభినందించారు. గత పదేళ్లగా అభివృద్ధి జరగలేదని తాము అంటున్నామని అన్నారు. ఇదిలావుంటే రేవంత్ రెడ్డిని సీఎంని చేసింది తానేనని బీఆరఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. రెడ్డి సామాజిక వర్గంలో రేవంత్ తప్ప మరెవరూ పవర్‌ఫుల్ నాయకుడు లేరని రెడ్డి సంఘం సమావేశంలో తానే చెప్పానని గుర్తు చేశారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో ఆయన చిట్‌చాట్ చేశారు. ఎవరు అవునన్నా, కాదన్నా తాను, రేవంత్ అన్నదమ్ములమేనని చెప్పారు.

# కోవిడ్ విషాదాలను మరచిన ప్రధాని మోడీ

- మండిపడ్డ విపక్ష నేత రాహుల్

**న్యూఢిల్లీ,మార్చి24:**
పశ్చిమాసియా ఉద్రిక్తతలను గురించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పార్లమెంటులో మాట్లాడుతూ పరిస్థితి కోవిడ్ తరహాలా ఉందంటూ పేర్కొనడంపై లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. కోవిడ్ మహమ్మారి సమయంలో జరిగిన విషాదాల గురించి ఆయన మరిచిపోయారా? అని ప్రశ్నించారు. పార్లమెంటు వెలుపల మీడియాతో రాహుల్ మంగళవారంనాడు మాట్లాడారు. 'పార్లమెంటులో ఆయన నిన్న సందర్భోచితం కాని మాటలు మాట్లాడారు. కరోనా మహమ్మారితో ప్రస్తుత సందర్భాన్ని పోల్చారు. ఎల్పీజీ, పెట్రోల్ ధరల్లో ఇప్పుడే పెరుగుదల మొదలైంది. ఇంతలోనే పరిస్థితిని కరోనా మహమ్మారి రోజులతో ఆయన పోలుస్తున్నారు. కరోనా విరుచుకుపడిన సమయంలో జరిగిన విషాదాల గురించి ఆయన మరిచిపోయినట్టున్నారు' అని రాహుల్ అన్నారు. దేశ విదేశాంగ విధానంపై రాహుల్ విమర్శలు గుప్పిస్తూ, దేశ విదేశాంగ విధానం మోదీ వ్యక్తిగత విదేశాంగ విధానంగా మారిందని, అంతర్జాతీయంగా ఇదొక హాస్యాస్పద అంశంగా మారిందని అన్నారు. 'మోదీ రాజీపడితే మన విదేశాంగ విధానం కూడా రాజీపడినట్టే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో మోదీ రాజీకొచ్చినట్టే కనిపిస్తోంది' అని వ్యాఖ్యానించారు. మధ్యఆసియాలో పరిణామాలపై ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న అఖిలపక్ష సమావేశంపై అడిగినప్పుడు, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసినా సరిదిద్దుకోలేని నిర్మాణాత్మక తప్పిదం జరిగిందని అన్నారు. అమెరికా ఏది చెబితే అది మోదీ చేస్తారని, రైతులు, దేశ ప్రయోజనాల కోసం పనిచేయరని విమర్శించారు. కేరళలో తనకు ప్రోగ్రాం ఉన్నందున అఖిల పక్ష సమావేశానికి హాజరుకాకపోవచ్చని చెప్పారు.

## అంబేడ్కర్ ఓవర్సీస్ పథకంతో
# 2వేల మందికి లబ్ధి

- అసెంబ్లీలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ వెల్లడి

**హైదరాబాద్,మార్చి24:**
విదేశీ విద్య ఉపకార వేతనాల పథకాన్ని ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. 2023 నుంచి ఇప్పటి వరకు అంబేడ్కర్ ఓవర్సీస్ పథకం ద్వారా సుమారు 2వేల మంది విద్యార్థులకు విదేశీ విద్య ద్వారా ఉపకార వేతనాలు చెల్లించామని చెప్పారు. శాసనసభ ప్రశ్నోత్తరాల్లో బీఆరఎస్ ఎమ్మెల్యే కేటీఆర్, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. దీనికోసం ఇప్పటి వరకు రూ.607 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. విదేశాల్లో చదువుకునే వారికి ఈ పథకం కింద నిబంధనలకు అనుగుణంగా ప్రభుత్వమే ఫీజు చెల్లిస్తుందని చెప్పారు. అంతకు ముందు కేటీఆర్ మాట్లాడుతూ 2025 అక్టోబర్‌లో విదేశీ విద్య ఉపకార వేతనాలు ఇస్తామని చెప్పినా ఇవ్వలేదన్నారు. విదేశాలకు వెళ్లిన విద్యార్థులు దీనికోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. అక్కడ ఫీజులు కట్టలేక.. ఇక్కడికి రాలేక ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వం దీన్ని ప్రాధాన్య అంశంగా తీసుకుని అమలు చేయాలని కోరారు.

## విజయవాడ హైవేలో
# ఎలివేటెడ్ కారిడార్

- అసెంబ్లీలో వెల్లడించిన మంత్రి కోమటిరెడ్డి



**హైదరాబాద్,మార్చి24:**
రాష్ట్రంలో రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం అధికా ప్రాధాన్యం ఇస్తోందని ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వ వార్షిక ప్రణాళికలో చేర్చిన తర్వాత డీపీఆర్ తయారు చేస్తారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్` విజయవాడ జాతీయ రహదారిపై ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు ట్రాఫిక్ రద్దీగా ఉందని, రామోజీ ఫిల్మ్ సిటీ దాటిన తర్వాత ఫుటఓవర్ బ్రిడ్జిలు కావాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో.. ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంపై నారాయణరెడ్డి ప్రశ్నించారు. తన నియోజకవర్గంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్బీనగర్ దాటిన తర్వాత పనామా వద్ద ప్లై ఓవర్ మంజూరు చేయించినందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. విజయవాడకు రెండు, మూడు గంటల్లో చేరే విధంగా.. డబుల్‌డెక్కర్ రోడ్డును మంజూరు చేయించుకున్నామన్నారు.

# పెరగనున్న లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలు

మొదటిపేజీ తరువాయి

**2029 ఎన్నికల కోసం చకచకా పనులు**
అసెంబ్లీ, లోక్ సభ నియోజకవర్గాల సంఖ్య పెంచడానికి వీలుగా రాజ్యాంగంలో కొన్ని సవరణలు చేయాల్సి ఉంటుంది. అందుకోసం ముందుగానే మహిళా రిజర్వేషన్ చట్టం, డీలిమిటేషన్ చట్టాలకు సవరణలు ప్రతిపాదిస్తూ ఈ పార్లమెంటు సమావేశాల్లో బిల్లులు తీసుకురాబోతున్నట్లు సమాచారం. లోక్‌సభలో ఇందుకు సంబంధించిన బిల్లు ఆమోదం పొందిన తర్వాత కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు చేయనుంది. చకచకా సీట్ల పెంపు కార్యక్రమం పూర్తిచేసి వచ్చే 2029 ఎన్నికల్లో అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. సీట్ల పెంపు దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు కూడా పెరుగుతాయని సమాచారం.

**మద్దతు కోసం కేంద్రం ప్రయత్నాలు**
2023 సెప్టెంబరులో ఆమోదించిన బిల్లు ప్రకారం 2034 నుంచి మహిళలకు 33శాతం రిజర్వేషన్లు అమల్లోకి రావాల్సి ఉంది. భారత రాజ్యాంగంలోని అధికరణలు 170(3), 81(3) ప్రకారం 2026 తర్వాత ప్రచురించే జనాభా లెక్కల ఆధారంగా దేశంలో నియోజకవర్గాల పునర్విభజన చేయాలని నిబంధన ఉంది. అందుకే కేంద్రం మహిళా రిజర్వేషన్ల అమలును 2034 నుంచి అమల్లోకి తెస్తుందని ఇప్పటివరకూ భావించారు. ఇప్పుడు జనగణన 2027 మార్చి 1కల్లా పూర్తి కానుంది. దీంతో ప్రాథమిక జనాభా లెక్కల వివరాలు ప్రకటించి ఆ వెంటనే నియోజకవర్గాల పునర్విభజన చేపటొచ్చు. ఈ అంశంపై అన్నిపార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం మొదలు పెట్టింది.

**దక్షిణాది రాష్ట్రాల కోసమే 50శాతం**
అయితే జనగణన తర్వాత వచ్చిన లెక్కల ఆధారంగా దామాషా ప్రకారం సీట్ల పెంపునకు అనుమతిస్తే దక్షిణాది ప్రాంతానికి అన్యాయం జరగుతుందనే వాదనలు కూడా ఉన్నాయి. మొదటి నుంచి దక్షిణాది రాజకీయ పార్టీలు ఈ విషయంపై ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉన్నాయి. ఇలాంటి ఇబ్బందులు రాకుండా ఉండాలనే అన్ని రాష్ట్రాల్లో సగటున లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలను 50శాతం పెంచాల ని నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీని వల్ల అన్ని రాష్ట్రాలకూ ఇప్పుడున్న రాజకీయ ప్రాతినిధ్యం యథాతథంగా కొనసాగే అవకాశం ఉంటుందని సమాచారం. కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనపై స్పందించడానికి రాజ్యసభలో విపక్షనేత మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో విపక్ష నాయకులు మంగళవారం సమావేశం కానున్నారు. అయితే సీట్ల పెంపు విషయంపై కేంద్రం ఇప్పటి వరకు ఎలాంటి అధికారికంగా ప్రకటన చేయలేదు. కసర్తులు మొదలుపెట్టినట్లు మాత్రమే తెలుస్తోంది.



# గీతంలో ఆధునిక కృత్రిమ మేధస్సుపై కార్యశాల

**పటాన్ చెరు, మార్చి 24, (సిరి న్యూస్):**

హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ కు చెందిన గణిత, గణాంక శాస్త్ర విభాగం 'ఆధునిక ఏఐ అన్వేషణ: సహజ భాషా ప్రాసెసింగ్ నుంచి అభిజ్ఞా మేధస్సు వరకు' పేరిట నిర్వహిస్తున్న రెండు రోజుల ఆచరణాత్మక కార్యశాలను మంగళవారం ఉదయం లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాదు విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ శిబా ఉద్గాట ముఖ్య అతిథిగా, కెపీఎమ్ జీ గ్లోబల్ డెలివరీ సెంటర్, హైదరాబాదుకు చెందిన డాక్టర్ కె. సంపత్ కుమార్ ఆత్మీయ అతిథిగా పాల్గొన్నారు. ముఖ్య అతిథి మాట్లాడుతూ, మానవ మెదడు యొక్క అద్భుతమైన సామర్థ్యాలను, దక్షతను వివరిస్తూ, మానవ మేధస్సు అనేక అంశాలలో కృత్రిమ మేధస్సును అధిగమిస్తూనే ఉందని నొక్కి చెప్పారు. విద్యార్థులంతా ఆత్మవిశ్వాసంతో ఉండాలని, నిరంతరం నేర్చుకోవాలని, ఏఐని సామాజిక ప్రయోజనానికి ఒక సాధనంగా బాధ్యతాయుతంగా ఉపయోగించాలని ప్రొఫెసర్ ఉద్గాట ప్రోత్సహించారు. ఏఐ యొక్క వేగవంతమైన పరిణామం గురించి గౌరవ అతిథి ప్రసంగిస్తూ, 'అటెన్షన్ ఈజ్ ఆల్ యు నీడ్' వంటి ప్రాథమిక పరిశోధనల నుంచి చాట్ జీపీటీ వంటి ఆధునిక అప్లికేషన్ల వరకు దాని పురోగతులను వివరించారు. వివిధ పరిశ్రమలలో ఏఐ తీసుకొస్తున్న పరివర్తనాత్మక ప్రభావాన్ని, ఏఐని వినియోగించు కోవడంలో పెరుగుతున్న డెవలపర్ల పాత్రను వివరించారు. సైబర్ సెక్యూరిటీ తో సహా కొత్తగా ఎదురయ్యే సవాళ్లకు సిద్ధంగా ఉండాల్సిన ప్రాముఖ్యతను డాక్టర్ సంపత్ కుమార్ వివరించారు. ఈ కార్యశాలలో డాక్టర్ పి.కృష్ణమూర్తి (ఐఐఐటీ హైదరాబాదు), ప్రొఫెసర్ రమేష్ కుమార్ మిశ్రా (హైదరాబాదు విశ్వవిద్యాలయం), ప్రొఫెసర్ అనిమేష్ ముఖర్జీ (ఐఐటీ ఖరగ్ పూర్) వంటి ప్రముఖ నిపుణులు పాల్గొంటున్నారు. కృత్రిమ మేధస్సు, సహజ భాషా ప్రాసెసింగ్, కాగ్నిటివ్ సైన్స్ లలోని ఇటీవలి పురోగతులను, వాటి గణిత, గణన పునాదులపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో ప్రముఖ సంస్థలకు చెందిన విద్యావేత్తలు, పరిశోధకులు నైపుణ్యోపన్యాసాలు చేయడంతో పాటు ఆచరణాత్మక శిక్షణ కూడా ఇస్తున్నారు. ఇందులో పాల్గొంటున్న వారు, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్, ఏజెంటిక్ ఏఐ, బహుభాషా ఎన్ఎల్ పీ, కాగ్నిటివ్-ప్రేరిత వ్యవస్థలతో సహా అభివృద్ధి చెందుతున్న ఏఐ సాంకేతికతల పై ఆచరణాత్మక అనుభవాన్ని పొందడంతో పాటు వివిధ పరిశ్రమలలో వాటి వినియోగంపై అవగాహనను కూడా ఏర్పరచుకుంటున్నారు.తొలుత, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ మోతహర్ రెజా అతిథులను స్వాగతించి, సత్కరించారు. విభాగాధిపతి డాక్టర్ జాదవ్ గణేష్ మార్గదర్శనంలో, డాక్టర్ కె.కృష్ణ, డాక్టర్ కె.భీమశంకర్ సహకారంతో డాక్టర్ డి. మల్లికార్జునరెడ్డి ఈ కార్యశాలను సమన్వయం చేస్తున్నారు. విద్యార్థి సమన్వయకర్తలు సహస్ర, దీప, సుష్మిక, స్నేహలు వారికి సహకరిస్తున్నారు. ఎం.ఎస్సీ. డేటా సైన్స్, బీ.ఎస్సీ. సీఎస్ సీఎస్, బీ.ఎస్సీ. స్టాటిస్టిక్స్ కోర్సులను అభ్యసిస్తున్న విద్యార్థులతో పాటు పలువురు అధ్యాపకులు, పరిశ్రమ నిపుణులు తదితరులు ఈ కార్యశాలలో పాల్గొంటున్నారు.లుత, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ మోతహర్ రెజా అతిథులను స్వాగతించి, సత్కరించారు. విభాగాధిపతి డాక్టర్ జాదవ్ గణేష్ మార్గదర్శనంలో, డాక్టర్ కె.కృష్ణ, డాక్టర్ కె.భీమశంకర్ సహకారంతో డాక్టర్ డి. మల్లికార్జునరెడ్డి ఈ కార్యశాలను సమన్వయం చేస్తున్నారు. విద్యార్థి సమన్వయకర్తలు సహస్ర, దీప, సుష్మిక, స్నేహలు వారికి సహకరిస్తున్నారు. ఎం.ఎస్సీ. డేటా సైన్స్, బీ.ఎస్సీ. సీఎస్ సీఎస్, బీ.ఎస్సీ. స్టాటిస్టిక్స్ కోర్సులను అభ్యసిస్తున్న విద్యార్థులతో పాటు పలువురు అధ్యాపకులు, పరిశ్రమ నిపుణులు తదితరులు ఈ కార్యశాలలో పాల్గొంటున్నారు.






# రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం





- **పటాన్ చెరు శాసనసభ్యులు, రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గూడెం మహిపాల్ రెడ్డి**

**పటాన్ చెరు, మార్చి 24, (సిరి న్యూస్):**

పల్లె నుండి పట్నం వరకు నిత్యం ప్రజలతో సంబంధాలు కలిగి ఉండే రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని, అవసరమైన పక్షంలో ఉద్యమాలకు సైతం సిద్ధమని పటాన్ చెరు శాసన సభ్యులు, రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటు చేసిన రేషన్ డీలర్ల సంఘం సంగారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశానికి ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల సంభవించిన, కరోనా లాంటి మహమ్మారి మూలంగా లక్షలాదిమంది చనిపోయిన సమయం లోనూ ప్రాణాలకు తెగించి ప్రజలకు నిత్యవసర వస్తువులు అందించడంలో రేషన్ డీలర్ల పాత్ర శ్లాగనీయమన్నారు. దశాబ్ద కాలంగా రేషన్ డీలర్లు వివిధ సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రేషన్ డీలర్లకు ఇచ్చిన ప్రధాన హామీలను వెంటనే అమలుపరచాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో డీలర్ల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాయికోటి రాజు మాట్లాడుతూ.. రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలతో పాటు, ప్రతి రేషన్ డీలర్ కు 10 లక్షల రూపాయల ఇన్సూరెన్స్, ఎంఎల్ఎస్ పాయింటలో ఎలక్ట్రానిక్ వే బ్రిడ్జిలు, కరోనా సమయంలో మరణించిన రేషన్ డీలర్ల కుటుంబ సభ్యులకు తిరిగి రేషన్ దుకాణాలు కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి సహాయ నీది చెక్కులను పంపిణీ చేసిన కూన శ్రీశైలం గౌడ్





**మేడ్చల్ మల్కాజ్గిరి ప్రతినిధి(సిరి న్యూస్)మార్చి 25**

కుత్బుల్లాపూర్ నియోజక వర్గ పర్ధి వివిధ ప్రాంతాలకు చెందిన ఎనిమిది లబ్ధిమందికి మంజూరైన నాలుగు లక్షల 4, 50,000 వేల విలువైన చెక్కులను షాపూర్ నగర్ లోని వారి నివాసంలో అనారోగ్య కారణంగా చికిత్స చేయించుకున్న రాజేష్ కుమార్ లవ్ సప్న శ్రీలేఖ ముద్దుల బాబు మహ్మద్ హుస్సేన్ మాధవి చిన్నస్వామి విశాలాక్షి చెక్కులను అందజేయడం జరిగింది ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేద కుటుంబాలకు ఒక గొప్ప వరమని వారు మాట్లాడారు నియోజకవర్గ పరిధిలో నిరుపేద కుటుంబాలు అనారోగ్యంతో బాధపడుతూ హాస్పిటల్లో చికిత్స చేసుకోవడానికి ఇబ్బంది పడుతున్న నియోజకవర్గ ప్రజలకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి తమ దృష్టికి తమ దృష్టికి తీసుకువస్తే ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి నిధులు మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలుపై సమగ్ర సమీక్ష

**గుమ్మడిదల పిహెచ్‌సిని జిల్లా కలెక్టర్ ప్రవీణ్య సందర్శన**



**గుమ్మడిదల, మార్చి 24 (సిరి న్యూస్):**

పురపాలక సంఘం కేంద్రమైన గుమ్మడిదలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను మంగళవారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావిణ్య ఆకస్మికంగా సందర్శించి అక్కడి వైద్య సేవల అమలు తీరును సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్యక్రమం అమలుపై అధికారులతో కలిసి విశ్లేషణ జరిపారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీకి వచ్చే రోగులకు అందిస్తున్న సేవలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఓపీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ, లాబరేటరీ పరీక్షల నిర్వహణ, రోగులకు అందజేస్తున్న మందుల పంపిణీ వంటి అంశాలను వివరంగా అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోగికి సంబంధించిన వైద్య వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసే విధానం సక్రమంగా అమలవుతుందా లేదా అనే విషయంపై ప్రత్యేక దృష్టి సారించారు. డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ వ్యవస్థ ద్వారా రోగుల వైద్య చరిత్రను సులభంగా ట్రాక్ చేయవచ్చని, దీని ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించడానికి అవకాశం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ విధానాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని, ఎలాంటి లోపాలు లేకుండా ప్రతీ రికార్డు సమయానికి నమోదు చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా రోగులకు సమయానికి వైద్య సేవలు అందేలా చూడాలని, పరీక్షలు, మందుల పంపిణీ వంటి అంశాల్లో ఎటువంటి ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పీహెచ్‌సీలో శుభ్రత, సౌకర్యాలపై కూడా దృష్టి పెట్టాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ నాగ నిర్మల, స్థానిక వైద్యాధికారి డాక్టర్ ఎస్. మధుకర్, తహసిల్దార్ పరమేష్, మండల అభివృద్ధి అధికారి ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# వలస కార్మికుల పిల్లల కోసం ప్రత్యేక విద్యా కార్యక్రమం

**ఏడ్ ఎట్ యాక్షన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహణ**





**గుమ్మడిదల, మార్చి 24 (సిరి న్యూస్):**

గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం గ్రామ సమీపంలో ఉన్న ఇటుక బట్టీల వద్ద పనిచేస్తున్న వలస కార్మికుల పిల్లల సంక్షేమం, విద్యాభివృద్ధి కోసం మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఏడ్ ఎట్ యాక్షన్ (ఇండియా) సంస్థ ఆధ్వర్యంలో, ఫికోసా ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఒడిశా రాష్ట్రం నుండి వలసగా వచ్చే కార్మికుల పిల్లల కోసం ఈ సంస్థ 7 వర్క్‌సైట్ పాఠశాలలు, సీసీఎల్‌సీ (చైల్డ్ కేర్ లెర్నింగ్ సెంటర్స్)లను సమర్థవంతంగా నిర్వహిస్తోంది. ఈ కేంద్రాల ద్వారా పిల్లలకు నాణ్యమైన విద్యాబోధనతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మధ్యాహ్న భోజన పథకం, ఐసీడీఎస్ ద్వారా టేక్ హోమ్ రేషన్, ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ఆరోగ్య సేవలు అందుతున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించే ఉద్దేశంతో సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా ఒడిశా భాషలో, సంప్రదాయ వేషధారణలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు హాజరైన వారిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏడ్ ఎట్ యాక్షన్ (ఇండియా) సంస్థ వలస కార్మికుల పిల్లలకు నాణ్యమైన విద్య అందిస్తూ వారి భవిష్యత్తును నిర్మించడంలో కీలక పాత్ర పోషిస్తోందని ప్రశంసించారు. సీడీపీఓ జయరాం నాయక్ మాట్లాడుతూ కష్టసాధ్య పరిస్థితుల్లో ఉన్న పిల్లలకు పోషకాహారం, విద్య, ఆరోగ్య సదుపాయాలు అందించడం ప్రశంసనీయమైన కార్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాంలో మండల విద్యాశాఖ అధికారి పాలనారెడ్డి, అన్నారం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు చక్రపాణి, గణిత శాస్త్ర ఉపాధ్యాయులు ప్రసాద్, ఏడ్ ఎట్ యాక్షన్ (ఇండియా) రీజినల్ మేనేజర్ సురేష్ గుట్ట, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కొత్త వెంకటేష్, ప్రోగ్రామ్ ఆఫీసర్ నటరాజ్, సూపర్వైజర్ గణేష్, సంస్థ ప్రతినిధులు రాంప్రనయ్, నవీన్, దుర్యోధన్, లక్ష్మీ, రాజారాం, నరేందర్, పూర్ణచందర్, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# వీరభద్ర స్వామి దేవస్థానంలో హుండీ లెక్కింపు

## రూ. 16.96 లక్షల ఆదాయం



**గుమ్మడిదల, మార్చి 24 (సిరి న్యూస్):**

గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలోని బొంతపల్లి శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానంలో హుండీ లెక్కింపు కార్యక్రమం మంగళవారం భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు. 118 రోజుల హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ. 16,96,418 వచ్చినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి శశిధర్ గుప్తా తెలిపారు. అదేవిధంగా అన్నదాన హుండీ ద్వారా రూ. 70,684 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.ఈ సందర్భంగా మాజీ చైర్మన్ మద్ది ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధికి భక్తుల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. హుండీ ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు వినియోగిస్తామని చెప్పారు. భవిష్యత్తులో దేవస్థానాన్ని మరింత అభివృద్ధి పరచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సురభి కుమార్ గౌడ్, గిద్దె విజయలక్ష్మి, జైపాల్ రెడ్డి, ఆలయ ఇన్స్పెక్టర్ నాచారం ఈవో రంగాచారి, మాజీ చైర్మన్ మద్ది ప్రతాప్ రెడ్డి, మాజీ ధర్మకర్తలు భాస్కర్ గౌడ్, యాదగిరి గౌడ్, పూజారి కృష్ణ, పొన్నబోయిన రాజు, ఆశ, శ్రీనివాస్ గౌడ్, అశోక్ గౌడ్, గ్రామ పెద్దలు ఆలేటి శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మీనారాయణ, హుస్సేన్, సేవా సంస్థల ప్రతినిధులు, పోలీస్ సిబ్బంది సంతోష్ కుమార్, ఆలయ సిబ్బంది సోమయ్య, అర్చకులు పాల్గొన్నారు.

# బడ్జెట్ లో ముదిరాజ్ లకు అన్యాయం

## ముదిరాజ్ జె ఏ సీ విమర్శ




**సోమాజిగూడ, మార్చి 24, (సిరి న్యూస్):**

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ సంవత్సరం బడ్జెట్ లో ముదిరాజ్ లకు తీరని అన్యాయం చేసిందని తెలంగాణ ముదిరాజ్ జాయింట్ యాక్షన్ కమిటీ విమర్శించింది. మంగళ వారం నాడు సోమాజి గూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జె ఏ సీ అధ్యక్షుడు పోల్కం లక్ష్మీ నారాయణ, కార్యదర్శి బాదిన లక్ష్మయ్య, గుండ్ల శ్రీనివాస్, ఉమ్మడి మెదక్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కే వి రవీందర్, హైద్రాబాద్ మహిళా విభాగం అధ్యక్షురాలు సీ ఎచ్ రాణి, మత్స్య సహకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ వి రమణ తదితరులు మాట్లాడారు. గత ఏడాది బడ్జెట్ లో 50 కోట్లు ముదిరాజ్ ల కోసం కేటాయించినప్పటికీ అందులో 50 లక్షలు కూడా ఖర్చు చేయలేదన్నారు. అవి కూడా కార్యాలయ సిబ్బంది వేతనలకే ఇచ్చారన్నారు. అదే విధంగా ముదిరాజ్ కార్పొరేషన్ కోసం మసాబ్ ట్యాంక్ లో ఒక చిన్న గది మాత్రం ఇచ్చారన్నారు. అదే ఆర్య వైశ్య కార్పొరేషన్ కి అరణ్య భవన్ లో గతంలో హరీష్ రావు ఆర్థిక మంత్రి గా కార్యకలాపాలు నిర్వహించిన ఆఫీస్ ఇచ్చారని ఇక్కడ కూడా పూర్తిగా ప్రభుత్వం తమ పై వివక్ష చూపిందన్నారు. వెయ్యి కోట్లు ముదిరాజ్ సంక్షేమానికి విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

# క్షయ వ్యాధి నిర్మూలనపై అవగహన



**మునిపల్లి మార్చ్ 24 (సిరి న్యూస్)**

ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా మునిపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. క్షయ వ్యాధి యొక్క లక్షణాలు తీసుకోవలసిన జాగ్రత్తలు చికిత్స విధానం వంటి విషయాలను వివరించారు.

# తెలంగాణా జెన్కో కు ఆంధ్ర అధికారి డిప్యూటేషన్!!

**హైదరాబాద్ ,మార్చి 24(సిరి న్యూస్ )**

మన పాలకులు, అధికారులు చేస్తున్న కుట్రల ఫలితంగా ఏపీ విద్యుత్ సంస్థల నుంచి తెలంగాణ విద్యుత్ విద్యుత్ సంస్థలకు అక్రమ డిప్యూటేషన్ల దందా సాగుతునే ఉంది. విద్యుత్ ఉద్యోగుల విభజనలో పదోన్నతులు కోల్పోయిన బాధితులు తెలంగాణ వాళ్లు. రాష్ట్రాభివృద్ధి కోసం ఆహార్నిషలు తెలంగాణ ఉద్యోగులు కృషి చేస్తుంటే, పాలకులేమో ఏపీ ఉద్యోగులకు రెడ్ కార్పెట్ పరుస్తున్నారు. ప్రత్యేకించి విద్యుత్తు సంస్థల్లో ఆంధ్రా మూలాలున్న వారికి ఏరికోరి కీలక పోస్టింగ్‌లిస్తున్నదన్న వాదనలున్నాయి. ఇదే కోవలో మరో ఆంధ్రా ఉద్యోగికి అక్రమ డిప్యూటేషన్ వ్యవహారం వెలుగుచూసింది. ఏపీ జెన్‌కోలో డిప్యూటీ- ఎగ్జిగ్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న జేవీ దుర్గారావును దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ (టీ-జీఎస్పీడీసీఎల్)లో డిప్యూటేషన్ ఇచ్చారు. ఏపీకి చెందిన ఆయనకు మూడేండ్ల పాటు- దక్షిణడిస్కంలో డిప్యూటేషన్ కేటాయిస్తు ఈ నెల 20న ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. అయితే 'ఇనిషియల్లీ త్రి ఇయర్స్ ఇంటర్ స్టేట్ డిప్యూటేషన్' అంటూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అంటే తొలుత మూడేండ్లు అవకాశం కల్పించారని, తర్వాత మళ్లీ పొడగించే అవకాశముందని తెలంగాణ ఇంజినీర్లు అనుమానిస్తున్నారు.ప్రస్తుతం తెలంగాణ ఒక ప్రత్యేక రాష్ట్రం. ఇక్కడ ఉన్న విద్యుత్ సంస్థలు ప్రభుత్వ రంగ సంస్థలుగా కొనసాగుతున్నాయి. రెండు రాష్ట్రాలు విడిపోయాయి కాబట్టి ఎవరి పాలన వారిదే. విద్యుత్ సంస్థల్లో సైతం ఎవరి పాలన వారే చేసుకుంటున్నారు. ఏ డిమాండ్‌తో అయితే మన ఉద్యోగులు రాష్ట్రం కోసం పోరాటం చేశారో ..... రాష్ట్రాన్ని సాధించుకున్న తర్వాత సైతం అదే దాడి జరుగుతుండడం శోచనీయం. ఇంకా ఏపీ విద్యుత్ సంస్థల నుంచి అక్రమంగా విద్యుత్ ఉద్యోగులు డిప్యూటేషన్ల పేరుతో తెలంగాణ విద్యుత్ సంస్థల్లో తిష్ట వేస్తుండడం, అందుకు మన పాలకులా ప్రమేయం ఉందా, లేక విద్యుత్ సంస్థల యాజమాన్యం సహకరిస్తుందా అనేది అంతు చిక్కని సమస్యనే. ఏపీ ఉద్యోగులకు డిప్యూటేషన్ల పేరుతో ఇక్కడికి రావడానికి అనుమతి నిస్తు, తెలంగాణ ఆత్మ గౌరవాన్ని తాకట్టు- పెడుతున్నారెందుకని విద్యుత్ ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో విద్యుత్ ఉద్యోగులపోత్రను మరిచిపోయి పది సంవత్సరాల తర్వాత కూడా తెలంగాణ ఉద్యోగుల పట్ల వారి ఆధిపత్యం ఉండేలా తీసుకుంటున్న చర్యలతో ఉద్యోగుల మనోభావాలను పాలకులకు పట్టడం లేదని పిస్తుంది. కాంగ్రెస్ ప్ర భుత్వం వచ్చిన తర్వాత ఏడాది పాటు సీమాంధ్ర అధికారులతో ఇంచార్జీ డైరెక్టర్లుగా నియమించిన పాలకులు ఆ తర్వాత రెగ్యులర్‌గా టీజీఎస్పీడీసీఎల్‌కు నియమించిన నలుగురు డైరెక్టర్లలో ఇద్దరిని సీమాంధ్ర మూలలున్న వారిని నియమించడం జరిగింది. ఆ ఇద్దరిలో ఒకరు తనది సీమాంధ్ర కాదు ఖమ్మం జిల్లా అని చెప్పుకుంటున్నప్పటికి ఉవ్వెత్తున ఎగిసిన తెలంగాణ ఉద్యమ సమయంలో సదరు అధికారి సీమాంధ్ర ఉద్యోగుల పక్షాన ఫ్ల కార్డులు పట్టుకుని తెలంగాణ వాదానికి వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర ఉంది. ఇదిలా ఉంటే కీలకమైన సీఈఐజీగా సీమాంధ్ర వాదినే నియమించారు. ఇక టీజీఎస్పీడీసీఎల్‌లో కీలకమైన హెచ్‌ఆర్, పీ అండ్ ఎంఎం , మేడ్చల్ జోన్, సెంట్రల్ జోన్ సీఈలుగా సీమాంధ్ర అధికారులనే నియమించారు. ప్రస్తుతం ఇవన్ని సరిపోనట్లు ప్రస్తుతం ఏపీ జెన్‌కో నుంచి రాష్ట్రం విడిపోయిన పన్నెండు సంవత్సరాల తర్వాత టీజీఎస్పీడీసీఎల్‌కు ఒక డివిజనల్ ఇంజనీర్‌ను మూడు సంవత్సరాల డిప్యూటేషన్ ప్రతిపాదికన పంపించడం శోచనీయం

**పాత సీఎండీ అనుమతితో ఏపీ ఉద్యోగి టీజీఎస్పీడీసీఎల్‌లోకి చొరబాటు .....**

టీజీఎస్పీడీసీఎల్ యాజమాన్యమే ఏడాపెడా ఎన్‌వోసీలు ఇస్తు ఉండడం, ఏపీ ఉద్యోగులను ప్రభుత్వం స్వాగతిస్తున్నది. ఎడా పెడా ఎన్‌వోసీలు జారీచేస్తున్నది. అధికారుల అనుమతితోనే ఇలా అక్రమార్గంలో ఇంజినీర్లు రంగ ప్రవేశం చేస్తున్నారు. కొంత కాలం క్రితం ఒక మహిళా అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ)ను దక్షిణ డిస్కంకు కేటాయించారు. ఇలా అక్రమంగా కేటాయించడం అప్పట్లో వివాదాస్పదమయ్యింది. తాజాగా అంతరాష్ట్ర డిప్యూటేషన్ పేరిట జేవీ దుర్గారావుకు ఎంట్రీ-నిచ్చారు.ఏపీ జెన్‌కోలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్) పని చేస్తున్న జే.వి. దుర్గారావు (ఎంప్లాయి ఐడీ నెంబర్ 1070826) ను టీజీఎస్పీడీసీఎల్‌కు మూడు సంవత్సరాల డిప్యూటేషన్‌పై పంపిస్తు ఈ నెల 20న ఏపీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ టూ గవర్నమెంట్(ఎఫ్ఏసీ) కే. విజయానంద్ ఉత్తర్వులు జారీ చేసి సదరు ఉద్యోగిని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థకు పంపించారు. సదరు దుర్గారావును టీజీఎస్పీడీసీఎల్‌లో తీసుకోవడానికి పాత సీఎండీ ముషారఫ్ ఫరూఖీ 2025 డిసెంబర్ 20న ఎన్‌వోసీ లేటర్ ఇవ్వడం జరిగింది. ఇప్పటికే తెలంగాణ ఉద్యోగులపై సీమాంధ్ర ఆధిపత్యం కొనసాగుతుండడమే కాకుండా సీమాంధ్ర ఉద్యోగుల వల్ల వందలాది మంది ఉద్యోగులకు పదోన్నతుల్లో జరిగిన విషయం విధితమే. అయినా పన్నెండు సంవత్సరాల తర్వాత కూడా సీమాంధ్రులు రావడమే మేమిటని విద్యుత్ ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఏపీ వారికి రెడ్‌కార్పెట్ పరచడాన్ని తెలంగాణ ఇంజినీర్లు, ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.డిప్యూటేషన్ విషయంలో అధికారులు తీరు అత్యంత దారుణంగా ఉంది. జనరేషన్ (విద్యుత్తు ఉత్పత్తి) సంస్థ ఇంజినీర్‌ను విద్యుత్తు పంపిణీ సంస్థ (డిస్కం)కు డిప్యూటేషన్‌పై కేటాయించారు. విద్యుత్తు ఉత్పత్తి వేరు. పంపిణీ వేరు.. రెంటిండికి సంబంధమే ఉండదు. అయినా ఎలా అనుమతిస్తారన్న ప్రశ్నలొస్తున్నాయి. మన రాష్ట్రంలోనే జెన్‌కో ఉద్యోగులకు డిస్కంలలో, డిస్కం ఇంజినీర్లను జెన్‌కోకు డిప్యూటేషన్‌పై కేటాయించడంలేదు. అలాంటిది పక్క రాష్ట్రంలోని ఇంజినీర్‌ను ఎలా అనుమతిస్తారన్న ఇంజినీర్లు నిలదీస్తున్నారు.

# హైదరాబాద్ నగరంపై ప్రభుత్వాని ఎప్పటికప్పుడు నిలదీస్తా

- **బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**

**మేడ్చల్ మల్కాజ్గిరి ప్రతినిధి(సిరి న్యూస్) మార్చి 24**



తెలంగాణ బడ్జెట్ సమావేశాలో నిర్వహించిన హైదరాబాద్ నగర అభివృద్ధిపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని - నగర అభివృద్ధిపై ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను ప్రజల గొంతుకై ప్రశ్నిస్తా.ఈ సందర్భంగా మాట్లాడుతూ అమెరికా మాజీ అధ్యక్షులు జాన్ ఎఫ్.కెన్నెడీ రహదారులు, మౌలిక వసతులపై తెలియజేసిన గొప్ప మాటలను ప్రస్తావించారు.తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన మొదటి రోజు నుంచి నగరానికి చెందిన ప్రజా ప్రతినిధులం అందరం కలిసి , బిఆర్ఎస్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కలిసి వారి మార్గదర్శకత్వంలో మాజీ మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో దాదాపు 47 పనులను, 40 ప్రాజెక్టులను ఎస్ఆర్డిపి కార్యక్రమం ద్వారా పాతబస్తీ తో పాటు నగర శివారు ప్రాంతాలలో ఫ్లై ఓవర్లు, లింక్ రోడ్లతో పాటు మౌలిక వసతులు కల్పించి 30 నుండి 40% ట్రాఫిక్ రద్దీని తగ్గించే విధంగా అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చాం. హైదరాబాద్ నగర అభివృద్ధిపై బిఆర్ఎస్ ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను గుర్తించి హైదరాబాదు నగర ప్రజలు మా పార్టీకి చెందిన ఎమ్మెల్యేలకు భారీ మెజార్టీతో మళ్లీ గెలిపించారు. హైదరాబాద్ నగర అభివృద్ధి విషయంలో రెండున్నర ఏళ్లలో కేవలం 120 కోట్లు ఖర్చు పెట్టడానికి చూస్తుంటే ప్రభుత్వానికి ఉన్న నిబద్ధత కనిపిస్తుంది హైదరాబాద్ నగరాభివృద్ధికి దాదాపు 15,500 కోట్లు కేటాయించిన ప్రభుత్వం గత రెండు సంవత్సరాల నాలుగు నెలల్లో 120 కోట్ల పనులు చేపడితే మిగిలిన పనులను చేపట్టేందుకు ఇంకా 100, 120 సంవత్సరాలు అవుతదా. ఎన్ని సంవత్సరాలు పడుతుంది. ఎందుకు ఈ లోపం. అని ప్రశ్నించారు హైదరాబాద్ నగరానికి చెందిన ప్రజాప్రతినిధిగా బాధతో చెప్తున్న ఈమాట.

**కుత్బుల్లాపూర్ - పైప్లైన్ రోడ్ వయా సెంట్ ఆంటోనీస్ రోడ్, వెన్నెలగడ్డ.**

కుత్బుల్లాపూర్ - పైప్లైన్ రోడ్ వయా గోదావరి హోమ్స్ పనులు రద్దయ్యాయి. కానీ రద్దయిన పనులను సభలో పెట్టారంటే ప్రభుత్వానికి నగరాభివృద్ధిపై ఉన్న శ్రద్ధ, అధికారులు ఏ విధంగా పనిచేస్తున్నారో స్పష్టమవుతా ఉంది. ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయాలు చేయాలి, ఆ తర్వాత అభివృద్ధి చేయాలి అనే ముఖ్యమంత్రి మాటకు ఆచరణలో, మాటలో సంబంధమే లేదు అనేది స్పష్టమవుతా ఉంది. మియాపూర్ - కూకట్పల్లి వై జంక్షన్ పనులు వర్క్ ఇన్ ప్రోగ్రెస్ అని సమాధానం ఇచ్చారు. కానీ అక్కడ కనీసం ఇటుక పెట్టి, పనులు ప్రారంభించిన దాఖలాలు లేవు. మీ మాటల్లోనే ప్రభుత్వ చిత్తశుద్ధి, అధికారుల పర్యవేక్షణ కనబడతా ఉంది. ప్యాకేజీ రెండు లో భాగంగా 29 కోట్లతో చేపడుతున్న ఎన్.హెచ్ 44 - రామిరెడ్డి నగర్ వయా ఫాక్స్ సాగర్ పనులను 100 ఫీట్ల లింకు రోడ్డుగా రోడ్డు పనులను చేపట్టిన 100 ఫీట్ల రోడ్డుకు సాధ్యం కాదని 40 ఫీట్లకు కుదించమని అడిగినా ఈరోజు వరకు దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు హైదరాబాద్ నగరాభివృద్ధిలో భాగంగా బాచుపల్లి చౌరస్తాలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు 2020, 2021 సంవత్సరంలో శంకుస్థాపన ప్రారంభమైన ఫ్లై ఓవర్ పనులు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 2 సంవత్సరాల నాలుగు నెలలు గడుస్తున్న పర్యవేక్షణ లేక నత్త నడకన సాగుతున్నాయి. 250 ఫీట్ల బ్రహ్మాండమైన రోడ్డు ఈ మార్గంలో 30, 40 అంతస్తుల హై రైజ్ అపార్ట్మెంట్లు వస్తున్నాయి. కానీ ఫ్లైఓవర్ పనులు ఎప్పుడు పూర్తవుతాయో అర్థం కావడం లేదు పేట్ బషీరాబాద్ సర్వేనెంబర్ 25/1, సెయింట్ ఆన్స్ స్కూల్ పక్క నుంచి ఎప్పటినుంచో బాట ఉంది. జర్నలిస్టులకు ఇండ్లు వచ్చినాయి, కాలనీలు వెలిసాయి. నగరాభివృద్ధి లో భాగంగా వెనుక వైపు ఉన్న కాలనీలకు ఎంతో ఉపయోగకరంగా ఉండే ఈ రోడ్డును అభివృద్ధి చేద్దామంటే హెచ్ఎండిఏ కమిషనర్ ఆపుతున్నాడు. ఎందుకు అని అడిగితే పొలిటికల్ ప్రెజర్ అంటున్నారు. ఇప్పటికే వాటర్ వర్క్స శివరేజ్ సాంక్షన్ చేసినారు. హెచ్ఎండిఏ కమిషనర్ పనులను ముందుకు సాగనివ్వక పోవడంతో అభివృద్ధి ఆగిపోయింది. దూలపల్లి - కొంపల్లి పనులు పర్యవేక్షణ లేక ముందుకు సాగడం లేదు. బోయిన్ పల్లి - సుచిత్ర - కొంపల్లి - కండ్ల కొయ్య - మేడ్చల్ ఫ్లై ఓవర్ పనులను ఎన్ హెచ్ ఎ ఐ చేపట్టినా ఏజెన్సీ కాంట్రాక్టర్ మూలంగా ఆగిపోయాయి. ఇప్పటికే 66 సార్లు ఢిల్లీకి వెళ్లిన ముఖ్యమంత్రి ఈ పనుల పురోగతిపై ఏనాడు ఎన్ హెచ్ ఎ ఐ అధికారులను సంబంధిత మంత్రితో గాని సమావేశమై పనుల పురోగతిపై చర్చించలేదు. హైదరాబాద్ నగరాభివృద్ధిపై నగరంలోని ఎమ్మెల్యేలతో కోఆర్డినేషన్ మీటింగ్ పెట్టాలని మొదటి బడ్జెట్ సమయంలో ముఖ్యమంత్రి నీ అడిగినం. నగరానికి చెందిన ప్రజాప్రతినిధులను అందరిని పిలిపించుకుంటాం. మాట్లాడతాం అన్నారు. ఒక్కసారి కూడా సమావేశం నిర్వహించిన సందర్భమే లేదు. ముఖ్యమంత్రి ఢిల్లీకి వెళ్తూ బిజీగా ఉన్నారేమో, కానీ రంగారెడ్డి జిల్లాకు చెందిన ఇన్చార్జి మంత్రిగా ఉన్న మీరైనా సమావేశం ఏర్పాటు చేయాలి మా బాధలు అసెంబ్లీలో వినరు, బయట విన్నారు. ఓడిపోయిన వాళ్ల పేర్లు బోర్డులపై పెడతారు. సీఎం నిర్లక్ష్యంతోనే హైదరాబాద్ నగర అభివృద్ధి కుంటుపడింది. ఎందుకు నిదర్శనం మంత్రి సమాధానం లోనే తప్పులు ఉన్నాయి. ప్రజలను ఇబ్బందులకు గురి చేసేరాజకీయాలను పక్కనపెట్టి ప్రభుత్వం హైదరాబాద్ నగరాభివృద్ధిపై దృష్టి సారించాలి వారు పేర్కొన్నారు

# గీతాస్కూల్ రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో

- **జిల్లాలో మూడో స్థానం విద్యార్థులను**
- **అభినందనుంచిన కరస్పాండెంట్.రామాంజనేయులు**




**తూప్రాన్ మార్చ్ 24 సిరి న్యూస్**

తూప్రాన్ గీత స్కూల్ మంగళవారం రోజు విద్యార్థులకు అభినందనలు తెలిపిన స్కూల్ కారస్పాండెంట్ రామాంజనేయులు డైరక్టర్ ఉషారాణి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7 వ తేదీ నుండి 9 వ తేదీ వరకు మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు లో జరిగిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలలో తృతీయ స్థానం పొందిన అండర్ -14 మెదక్ జిల్లా జట్టులో అద్భుత ప్రతిభ కనబరచిన గీతా స్కూల్ విద్యార్థులు యన్. మహిత్ యన్. నాగ శ్రీకర్ లను పాఠశాల కరెస్పాండెంట్ పి. రామాంజనేయులు, చైర్ పర్సన్ పి. ఉష విద్యార్థులను అభినందించారు తమ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో రాణించడం పట్ల హర్షం వ్యక్తం చేసారుఈ సందర్భంగా ఇంచార్జి ప్రిన్సిపాల్ ప్రేమ్ రాజ్ వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వర్ వ్యాయామ ఉపాధ్యాయులు శైలెందర్ కరుణాకర్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు

# జంటనగరాల్లో వాహనాలకు గ్యాస్ కొరత

## నోస్టాక్ బోర్డులతో దర్శనమిస్తున్న బంకులు!!

**హైదరాబాద్, మార్చి 24(సిరిన్యూస్ )**

పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధం ప్రపంచాన్ని వణికిస్తుంది. యుద్ధం అక్కడ జరిగితే ఇక్కడ జనాలపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. పశ్చిమాశియా చమురు నిల్వలపై ఆధారపడిన దేశాలన్ని అతలాకుతలం అవుతున్నాయి. ప్రధానంగా పెట్రోల్, గ్యాస్ ప్రభావంతో చాలా మంది జీవనోపాధిని కోల్పోతున్నారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా భీకర దాడుల నేపథ్యంలో గగనతలం, సముద్ర జలమార్గాలు పూర్తిగా స్తంభించాయి. వంటింటి గ్యాస్ కష్టాలే కాకుండా ఎల్‌పీజీ గ్యాస్ లేక ఆటోలు, క్యాబ్‌లు నడుపుకుని జీవనోపాధిని పొందే పేద వర్గాలు పస్తులుండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. వంటింటి గ్యాస్ లేక పోయినా కట్టెలపైనో, కరెంట్ స్టౌవ్‌లపై పని కానిచ్చుకుని కాలం వెళ్లదీయవచ్చు. కానీ పొద్దున నుంచి రాత్రి వరకు ఆటోనో క్యాబో నడుపుకుని నాలుగు రూపాయలు సంపాదించుకుని కుటుంబాన్ని పోషించుకునే పేద, మధ్య తరగతి వాసులపై ఎల్‌పీజీ గ్యాస్ ప్రభావం ప్రత్యక్షంగా పడుతుంది. ఎల్‌పీజీ గ్యాస్ బంక్‌ల వద్ద ఆటోలు, క్యాబ్‌లు కిలోమీటర్ల మేర క్యూ లైన్లలో గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితులు మన హైదరాబాద్ నగరంలో కనిపిస్తున్నాయి.

**ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ఎల్‌పీజీ కష్టాలు ......**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 70 వేలకు పైగా ఆటోలు ఎల్‌పీజీ గ్యాస్‌తో నిర్వహిస్తారు. 30 వేలకు పైగా క్యాబ్‌లు సైతం ఎల్‌పీజీతోనే నిర్వహించడం జరుగుతుంది. ట్రాన్స్‌పోర్టుకు చెందిన ఈ వాహనాలే కాకుండా ప్రైవేట్ వాహనాలు లక్షకు పైగా ఎల్‌పీజీ గ్యాస్‌తో నిర్వహిస్తారు. ఎల్‌పీజీ/ పెట్రోల్ తో నిర్వహిస్తున్న ఆటో కార్మికులు గత వారం పది రోజులుగా ఎల్‌పీజీ గ్యాస్ కొరతతో పెట్రోల్ ఉపయోగించి కాలం వెళ్లదీశారు. అయితే పెట్రోల్ బంక్‌ల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమివ్వడంతో అక్కడ వాహనాల తాకిడి పెరగడంతో ఖరీదైన పెట్రోల్ కన్నా తక్కువ ధరలో లభించే ఎల్‌పీజీ గ్యాస్ బెటరని బావించిన ఆటో కార్మికులు, క్యాబ్ నిర్వహకులు గ్యాస్ బంక్‌ల బారులు తీరారు. కిలోమీటర్ల మేర క్యూ లైన్లు ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరిపడ గ్యాస్ లేక పోవడంతో వాహనాన్ని నడిపించక జీవనోపాధిని కోల్పోతున్నారు. పొద్దంత ఆటోనో, క్యాబ్ నిర్వహించుకుని నాలుగు డబ్బులు సంపాదించి తమ కుటుంబాన్ని పోషించుకునే వేలాది కుటుంబాలలో సగం పస్తులుండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని, గ్యాస్ లేక తమ బతుకు భారంగా మారుతుందని ఆటో కార్మికులు వాపోతున్నారు.

**పెట్రోల్ బంకుల్లో సైతం నో స్టాక్ బోర్డులు .....**

హెదరాబాద్‌లో పెట్రోల్ బంకుల ఎదుట బారులుతీరుతున్నారు. హైదరాబాద్ సహా జిల్లాకేంద్రాల్లో వందలాది బంకుల్లో 'నో స్టాక్' బోర్డులు దర్శనమిచ్చాయి.నగర శివార్లలో సైతం ఉప్పల్, మల్లాపూర్, ఘట్కేసర్, అత్తాపూర్ లాంటి చోట్ల నో పెట్రోల్ బోర్డులు ఏర్పాటు- చేసిన బంక్ యజమానులు.నో స్టాక్ బోర్డులతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయిల్ కంపెనీలకు, డీలర్లకు మధ్య నెలకొన్న 'ఉద్దెర' సమస్యే ఇందుకు కారణమని తెలుస్తుండగా.. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు-న్నారు. ఇంతకాలం డీలర్లకు క్రెడిట్‌పై పెట్రోల్, డీజిల్ సరఫరా చేసిన కంపెనీలు ఇప్పుడు 'నో క్రెడిట్' విధానాన్ని అమలు చేస్తున్నాయి. డబ్బులు పూర్తిగా చెల్లించిన తర్వాతే ఇంధనం సరఫరా చేస్తున్నాయి. దీంతో పెద్ద మొత్తంలో నగదు చెల్లించలేని డీలర్లు కొనుగోళ్లు తగ్గించుకోవడంతో బంకుల్లో కొరత ఏర్పడింది. ఇన్నాళ్లూ ఉద్దెర ఇచ్చిన కంపెనీలు ఇప్పుడు పశ్చిమాసియా యుద్ధాన్ని సాకుగా చూపుతూ క్రెడిట్ ఇవ్వడం లేదని, పైగా పెండింగ్ డబ్బులు పూర్తిగా చెల్లించాలని ఒత్తిడి చేస్తుండడంతో బంకులు మూసేస్తున్నామని నిర్వాహకులు చెప్తున్నారు. అయితే బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు పెడ్తున్న నిర్వాహకులపై సివిల్ సప్లై అధికారులు సీరియస్ అవుతున్నారు. కంపెనీలకు వెంటనే డబ్బులు చెల్లించి, పెట్రోల్, డీజిల్ తెప్పించుకోవాలని.. అలాకాకుండా బంకులు మూసేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

**గ్రేటర్‌లో 3000లకు పైగా పెట్రోల్ బంకులు:**

-ఒక్క హైదరాబాద్ జిల్లాలోనే 1,200కు పైగా పెట్రోల్ బంకులున్నాయి. హైదరాబాద్ జిల్లాలో సాధారణంగా రోజుకు 40 లక్షల నుంచి 70 లక్షల లీటర్ల వరకు పెట్రోల్, డీజిల్ సరఫరా జరుగుతుంది. తాజా పరిణామాల నేపథ్యంలో డీలర్లు దాదాపు 25 శాతం వరకు కొనుగోళ్లు తగ్గించినట్లు- సమాచారం. దీంతో నాలుగు రోజుల క్రితం జిల్లాల్లో మొదలైన సమస్య క్రమంగా నగరానికి పాకింది. గ్రేటర్ పరిధిలోని అంబర్‌పేట్, చిక్కడపల్లి, బంజారాహిల్స్, లంగర్‌హౌజ్, బోయిన్‌పల్లి, సికింద్రాబాద్, నాంపల్లి, ఓల్డ్‌సిటీ తదితర ప్రాంతాల్లో అనేక బంకులు మూతపడ్డాయి. దీంతో స్టాక్ ఉన్న బంకుల వద్ద వాహనదారులు గంటల తరబడి క్యూల్లో నిలబడుతూ ఇబ్బందులు పడుతున్నారు. ఇక పెట్రోల్ కొరత ఉందనే వదంతులు వ్యాపించడంతో ప్రజల్లో ఆందోళన మరింత పెరుగుతున్నది. ఇప్పటివరకు ట్రావెల్ కంపెనీలు, పరిశ్రమలు, ఇతర వాణిజ్య సంస్థలకు క్రెడిట్‌పై ఇంధనం అందించిన అయిల్ కంపెనీలు ఇప్పుడు చేతులెత్తేయడంతో ఆ రంగాలపై కూడా ప్రభావం పడుతున్నది. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు సైతం ఇంధనం కోసం ఇబ్బందులు పడుతున్నాయి.

**ఆటో కార్మికులను ఆదుకోవాలి....**

అర్ల సత్తిరెడ్డి, ఆటో సంఘాల నేత పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం సెగలు హైదరాబాద్‌ను తాకాయి. యుద్ధ ప్రభావంతో ఏర్పడిన గ్యాస్ కొరత పేద ఆటో కార్మికుల పాలిట శాపంగా మారింది. జీవనోపాధి లేక వేలాది కుటుంబాలు పస్తులుండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రత్యామ్నాయం ఆలోచించి ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలి.

**గ్యాస్ సమస్యను పరిష్కరించాలి....**

కిరణ్, ఆటో సంఘాల నేతఎల్‌పీజీ సమస్య ఆటో కార్మికుల పట్ల శాపంగా మారింది. ఎల్‌పీజీ గ్యాస్ మీద ఆధారపడి గ్రేటర్ హైదరాబాద్‌లో సుమారు లక్ష కుటుఉంబాలు ఆధారపడి ఉన్నాయి. యుద్ధం ప్రభావంతో గ్రేటర్ హైదరాబాద్‌లో ఎల్‌పీజీ గ్యాస్ కొరత వల్ల ఆటో నడుపుకుని జీవనం సాగించే వేలాది కుటుంబాలు పస్తులుంటున్నాయి. ఆటో కార్మికుల బతుకులు గంటల తరబడి బంక్ వద్దనే గడపాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వం ప్రత్యామ్నాయం ఆలోచించి గ్యాస్ సమస్యకు పరిష్కారం చూపించాలి.

## ఉగాది అవార్డు పురస్కారం అందుకున్న సీనియర్ జర్నలిస్ట్ టి. రమేష్






**మేడ్చల్ మల్కాజ్గిరి ప్రతినిధి (సిరి న్యూస్) న్యూస్ మార్చి 24**

ఏనుగు నర్సింహారెడ్డి ఐ ఏ ఎస్ చేతులమీదుగా రవీంద్రభారతి లో ప్రముఖుల చేతుల మీదుగా ఉగాది పురస్కారం తో భాద్యత మరింత పెరిగింది జర్నలిస్ట్ టి. రమేష్ మాట్లాడుతూవిపంచి ఫౌండేషన్ ఉగాది పురస్కారం ను సీనియర్ జర్నలిస్ట్ టి. రమేష్ రవీంద్రభారతి లో జరిగిన కార్యక్రమం లో ఏనుగు నర్సింహారెడ్డి ఐ ఏ ఎస్ చేతులమీదుగా రవీంద్రభారతి లో ప్రముఖుల సమక్షంలో ఉగాది పురస్కారం అందుకున్నారు. కొన్ని సంవత్సరాలుగా సామాజిక, సాహిత్య, సాంస్కృతిక, విద్యా కార్యక్రమాలలో కృషి చేస్తున్న విపంచి ఫౌండేషన్ ప్రతీ ఏటా ఇచ్చే ప్రతిష్ఠాత్మక పురస్కారానికి సీనియర్ జర్నలిస్ట్ టి. రమేష్ ని విపంచి ఫౌండేషన్ ప్రత్యేక జూరి కమిటీ ఎంపిక చేసింది. పత్రికా రంగంలో టి రమేష్ చేస్తున్న కృషికి ఈ అవార్డును ప్రకటిస్తున్నామని నిర్వాహకులు చెప్పారు. యాదాద్రి జిల్లా ఆత్మకూరు చెందిన రమేష్ భువనగిరి లోని డిగ్రీ చదువుకున్న సమయం నుండే జర్నలిజం పై ఆసక్తి తో పలు పత్రికలో స్థానిక సమస్యల స్పందిస్తూ సుమారు 30 సంవత్సరాలనుండి సాహిత్య పరిశోధక వ్యాసాలతో తెలుగు భాషా సాహిత్యానికి తనవంతు సేవలు అందిస్తున్నాడని . చిన్న వయస్సులోనే సాహితీ మాగాణంలో చెరగని ముద్రను వేసుకున్నాడని తెలిపారు. జర్నలిస్ట్ టి.రమేష్ నేడు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లో జర్నలిస్ట్ గా పనిచేస్తున్నారన్నారు. భవిష్యత్ లో మరిన్ని రచనలు చేసి తెలంగాణకు మరింత ఖ్యాతిని తీసుకురావాలని కాంక్షించారు.తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, విపంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి రెండు తెలుగు రాష్ట్రాల నుండి అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పదవ తరగతిలో మంచి ఉత్తీర్ణత శాతం సాధించాలి





**• జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు**

**గుమ్మడిదల, మార్చి 24 (సిరి న్యూస్):**

పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ఉత్తీర్ణత శాతం సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి వారి చదువు స్థాయి సన్నద్ధత గురించి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న విధానాన్ని పరిశీలించి తగిన సూచనలు చేశారు. అలాగే పాఠశాలలో తాగునీటి సదుపాయం, మరుగుదొడ్ల నిర్వహణపై సమీక్ష నిర్వహించి అవసరమైన మెరుగుదలలపై ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. పరీక్షల సమయంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఎంతో ముఖ్యమని, జీర్ణానికి ఇబ్బంది కలిగించే ఆహారాలను నివారించి, తేలికపాటి పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా జాగ్రత్తలు తీసుకోవాలని పరీక్షల సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పొలిన, ఉపాధ్యాయులు వాకిటి శ్రీదేవి, ప్రసాద్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

## తూప్రాన్ బైపాస్ లో కూలీలతో వెళ్తున్న ఆటో బోల్తా 13 మందికి గాయాలు



**తూప్రాన్ మార్చ్ 24 సిరి న్యూస్**

తూప్రాన్ 44 వ జాతీయ రహదారి బైపాస్ పై మంగళవారం రోజు కూలీలతో వెళుతున్న ఆటో బోల్తా 13 మంది మహిళా కూలీలకు గాయాలుతూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రి లో చికిత్స ఇద్దరి పరిస్థితి విషయం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ ప్రవేట్ ఆసుపత్రి కి తరలించారు కూలీలు మసాయిపేట మండలం పోతిన్ పల్లి గ్రామం నుండి 13 మంది కూలీలతో వెళుతున్న సంబెల్ అనే సీడ్ కంపెనీ కి వెళుతున్న ఆటో ప్రమాద సమయంలో 13 కూలీలు ఉన్నారు కేసు నమోదు చేసి ధర్యాప్త చేస్తున్నట్లు ఎస్ఐ గంగారాజు తెలిపారు

## ఎలక్ట్రీకల్ బైక్ షాట్ సరిక్యూట్ తో దగ్ధం



**తూప్రాన్ మార్చ్ 24 సిరి న్యూస్**

తూప్రాన్ పట్టణం లోసోమవారం అర్ధరాత్రి షాట్ సరిక్యూట్ తో ఎలక్ట్రికల్ బైక్ దగ్ధం అయిన సంఘటన చోటు చేసుకుంది పట్టణం లోని నర్సాపూర్ చౌరస్తా వద్ద చంద్ర శేఖర్ రెడ్డి ఎలక్ట్రికల్ బైక్ ఛార్జింగ్ పెట్టగా అర్ధరాత్రి షాట్ సరిక్యూట్ తో పూర్తిగా దగ్ధం కావడం మంటలు రావడం తో అక్కడ ఉన్నా వారు నీటి తో మంటలు ఆర్పడానికి ప్రయత్నించిన జరగాల్సిన నష్టం జరిగిపోయింది అని సుమారు లక్షన్నర రూపాయల ఆస్తి నష్టం జరిగిందని చంద్ర శేఖర్ రెడ్డి తెలిపారు

## మణుగూరు డిఎస్పీ చేతుల మీదుగా టీవీ5 హిందూ ధర్మ పంచాంగ పుస్తకం ఆవిష్కరణ

**మణుగూరు.మార్చి 24 సిరి న్యూస్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు లోని డీఎస్పీ కార్యాలయం లో టీవీ 5 హిందూ ధర్మ పంచాంగ పుస్తకాన్ని డిఎస్పీ రవీందర్ రెడ్డి వేద పండితుల మంత్రోచారణ నడుమ ఆవిష్కరించారు.. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ తెలుగు నూతన సంవత్సరం ఉగాది నుండి మొదలవుతుందని తెలుగు సంస్కృతిని అందరికి తెలిసేలా ప్రతి సంవత్సరం పంచాంగ పుస్తకం ప్రింట్ చేసి తెలుగు ప్రజలకు అందిస్తున్న టీవీ5 యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలియచేశారు.. అలాగే నిత్యం ప్రజా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న టీవీ5 కి ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధి లా టీవీ 5 టీమ్ పని చేస్తుందని, ప్రజల్లో ఆధ్యాత్మికంగాచైతన్యం రావాలని టీవీ 5 యాజమాన్యం కృషి చేస్తుందని అన్నారు .. అంతేకాకుండా మన వాళ్ళు జనవరి 1 నూతన సంవత్సర వేడుకలు చేసుకోవడం అలవాటు గా మారిందని , అసలు నూతన సంవత్సరం ఉగాది నుండి మొదలవుతుంది అని ప్రజలు ఇది గమనించాలని అన్నారు.. మానవ జీవితాలకు అర్థం తెలిసేలా ఉగాది పచ్చడి తో షడ్రుచులు సమ్మేళనం నిదర్శనం అని ఆయన అన్నారు.. ఈ కార్యక్రమంలో పినపాక నియోజకవర్గ టీవీ5 ప్రతినిధి జొన్నలగడ్డ వెంకటేశ్వరరావు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు వన్నం కృష్ణ మోహన్, సీనియర్ జర్నలిస్టులు పుసులూరి శ్రీనివాస్, ప్రసాద్, విత్తనాల శ్రీనివాస్ మరియు హిందూ ప్రచార సమితి నాయకులు నాగేశ్వరరావు లు పాల్గొన్నారు.

## మణుగూరులో బీసీ బాలికల పాఠశాల భవనానికి రూ. 29 కోట్లు మంజూరు చేయాలని కోరుతూ వినతి

**మణుగూరు.మార్చి 24 సిరి న్యూస్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,పినపాక నియోజకవర్గ పరిధిలోని మణుగూరులో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలికల వసతి పాఠశాలకు శాశ్వత భవన నిర్మాణం కోసం రూ. 29 కోట్ల నిధులు వెంటనే మంజూరు చేయాలనిపినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కోరారు.ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

పాఠశాల ప్రైవేట్ భవనంలో నడుస్తోందని స్థలాభావం,మరియు మౌలిక వసతుల కొరత వలన

విద్యార్థినులు పలు రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ,

రామానుజవరం గ్రామంలో 5 ఎకరాల ప్రభుత్వభూమి గుర్తించినట్టు,

సమగ్ర క్యాంపస్ నిర్మాణం (స్కూల్ + జూనియర్ కాలేజీ + హాస్టల్)

అంచనా వ్యయం: రూ. 29 కోట్ల రూపాయలు.

విద్యార్థుల వివరాలు

పాఠశాల విభాగం: 291 మంది,

జూనియర్ కాలేజీ: 120 మంది,

మొత్తం విద్యార్థినులు: 411 మంది అని,

బోధనా & బోధనేతర సిబ్బంది సహా మొత్తం 451 మందికి సౌకర్యాలు అవసరం అని,విద్యార్థినుల భవిష్యత్తు దృష్ట్యా ఈ ప్రాజెక్టును అత్యవసరంగా పరిగణించి తక్షణమే నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ వినతిపై మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ సానుకూలంగా స్పందిస్తూ—


బీసీ బాలికల విద్యకు ప్రాధాన్యత ఇస్తామని సంబంధిత అధికారులతో చర్చించి త్వరలోనే నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

బీసీ విద్యార్థుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారికి మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని స్పష్టం చేశారు.

# వందేళ్లు బతికే సీక్రెట్ ఈ దేశస్తులకే తెలుసు..!



మనిషి ఆయువు వందేళ్లంటారు. ఒకప్పుడు మన పూర్వీకులు ఆయుష్షులో 'సెంచరీ'లు కొట్టేసేవారని మన పెద్దలు అప్పుడప్పుడు చెబుతూ ఉంటారు. కానీ, ప్రస్తుతం ఉన్న జీవన విధానంలో మార్పుల కారణంగా సరాసరి ఆయుష్షు 70 ఏళ్లు మించడం లేదు. లైఫ్‌స్టైల్, రోగాలు, దురాలవాట్లతో చాలా మంది చిన్న వయస్సులోనే జీవితాన్ని ముగిస్తున్నారు. హార్ట్ స్ట్రోక్ మరణాలు ఎక్కువవుతున్నాయి. ఉన్నట్టుండే మనుషులు కుప్పకూలుతున్నారు. ఎవరు ఎప్పుడు ఎక్కడ ఎలా పోతారో ఎవరికీ అర్థం కావడం లేదు. వీటన్నిటి నడుమ ప్రశాంతంగా ఓ అరవై ఏళ్లు బ్రతకడం కూడా కష్టమవుతోంది. మరి ఎక్కడైనా 80 ఏళ్లకు పైనే జీవించే వారు ఉన్నారా..? అంటే అందరూ ఈ దేశాలవైపే చూస్తున్నారు. మరి ఆ దేశాలు ఏమిటో తెలుసుకుందాం.



ముందుగా దక్షిణ కొరియానే చెప్పుకోవాలి. ఎందుకంటే ఇక్కడ సగటు ఆయుర్దాయం 90పైమాటే అంటా. ప్రపంచంలో 90ఏళ్లు సగటు ఉన్న తొలి దేశంగా దక్షిణ కొరియా రికార్డు సృష్టించింది. ఈ దేశం బలమైన ఆర్థిక వ్యవస్థను కలిగి ఆదర్శంగా నిలుస్తోంది. పాశ్చాత్య దేశాలతో పోలిస్తే ఇక్కడి ప్రజలకు తక్కువ రక్త పోటు, మెరుగైన ఆరోగ్య సంరక్షణ సదుపాయాలు ఉన్నాయి. కొరియన్లు ఎక్కువగా పులియబెట్టిన ఆహారాన్ని డైట్ గా తీసుకుంటారు. ఇది కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి, క్యాన్సర్ ను నివారిస్తూ రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయి. వీరు బౌద్ధ మతాన్ని ఆచరిస్తారు. దీనివల్ల వీరు ఒత్తిడి ఆందోళన దూరంగా ఉంటారు.

### స్పెయిన్

స్పెయిన్ లో సగటు ఆయుర్దాయం 82.8 సంవత్సరాలు. స్పెయిన్ కూడా జపాన్ మాదిరిగానే ఉంటుంది. స్పానిష్ ప్రజల అధిక ఆయుర్దాయానికి కారణం వారి మెడిటేరియన్ డైట్. ఆలివ్ ఆయిల్ - కూరగాయలు - వైన్ వంటివి గుండెకు మేలు చేకూరుస్తాయి. అరగంట భోజన విరామానికి బదులుగా 2నుంచి 3గంటల విరామం తీసుకుంటారు. వీరంతా వాహనాలను వినియోగించడం కంటే నడకకే ప్రాధాన్యమిస్తారు.



### జపాన్

జపానీయులు ఎక్కువ కాలం జీవిస్తారనే చాలా మందికి తెలుసు. వీరి సగటు ఆయుర్ధాయం 83సంవత్సరాలు. జపాన్ ను అమర వీరుల భూమిగా పిలుస్తారు. జపాన్ ప్రజలు అత్యున్నత నాణ్యమైన జీవనాన్ని కలిగి ఉంటారు. వీరు తీపి బంగాళదుంపలు, చేపలు, రిచ్ డైట్ తీసుకుంటారు. జపాన్లో ప్రాచీనం నాటి సంస్కృతులు పాటిస్తూ ప్రాచీన ఆహారాన్ని తీసుకుంటుండడం వారి ఆయుర్ధాయం పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది.




### స్విట్జర్లాండ్


స్విట్జర్లాండ్ లో ప్రజల సగటు ఆయుర్ధాయం 81 సంవత్సరాలు. స్విట్జర్లాండ్ ఐరోపాలోని సంపన్న దేశాలలో ఒకటి. ఆరోగ్య సంరక్షణ బలమైన వ్యక్తిగత భద్రత ప్రజా శ్రేయస్సు వంటివి ప్రజలు ఎక్కువ కాలం జీవించేందుకు దోహదపడుతున్నాయి. చీజ్, డైరీ ఉత్పత్తులను తీసుకుంటారు. స్విట్జర్లాండ్ వృత్తి ఆధారిత దేశం. ఇక్కడి ప్రజలు వీకెండ్స్ లో ప్రయాణాలను ఎంజాయ్ చేస్తూ గడుపుతుంటారు.






# శ్వాస తీసుకోకుండా బతికే జీవి ఇదే!

ప్రపంచంలో చాలా వింత జీవులు ఉన్నాయి. ఇవి వాటి ప్రత్యేకతలకు ప్రపంచమంతటా ప్రసిద్ధి చెందాయి. భూమ్మీద బతకడానికి ప్రతి జంతువు ఆక్సిజన్ పీల్చుకోవాల్సిందేనని చిన్నప్పటి నుంచి చదువుకుంటూనే ఉన్నాం. అది నీటిలో కరిగిన ఆక్సిజన్ అయినా కావొచ్చు, లేదా గాలిలో వాయువు రూపంలోనైనా కావొచ్చు. కానీ కొత్తగా ఆక్సిజన్ పీల్చుకోకుండా బతుకుతున్న ఓ చిన్న జంతువును ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్ యూనివర్సిటీ పరిశోధకులు కనిపెట్టారు.



ప్రపంచంలో చాలా వింత జీవులు ఉన్నాయి. ఇవి వాటి ప్రత్యేకతలకు ప్రపంచమంతటా ప్రసిద్ధి చెందాయి. భూమ్మీద బతకడానికి ప్రతి జంతువు ఆక్సిజన్ పీల్చుకోవాల్సిందేనని చిన్నప్పటి నుంచి చదువుకుంటూనే ఉన్నాం. అది నీటిలో కరిగిన ఆక్సిజన్ అయినా కావొచ్చు, లేదా గాలిలో వాయువు రూపంలోనైనా కావొచ్చు. కానీ కొత్తగా ఆక్సిజన్ పీల్చుకోకుండా బతుకుతున్న ఓ చిన్న జంతువును ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్ యూనివర్సిటీ పరిశోధకులు కనిపెట్టారు.

హెన్నెగువా సాల్మినికోలా అని పిలిచే ఈ జీవి శరీరం కేవలం పది కణాలతో నిర్మితమై ఉంటుంది. ఇది ఆక్సిజన్ లేకుండా జీవించగలదు. ప్రపంచంలో ఇదే దీని ప్రత్యేక లక్షణం. ఉన్న ప్రపంచంలో ఇలా జీవించే మొదటి జీవి. జెల్లీ ఫిష్ లాగా కనిపించే ఈ బహుళ సెల్యులార్ పరాన్నజీవికి మైటోకాన్డ్రియల్ జన్యువు లేదు. శాస్త్రవేత్తల చెప్పినదాని ప్రకారం ఈ జీవి తన చుట్టూ ఉండే చేపల నుండి శక్తిని పొందుతుంది. కానీ ఈ సమయంలో అది వారికి ఏ విధంగానూ హాని కలిగించదు. మరో ప్రత్యేక విషయం ఏమిటంటే చేపలు కూడా ఈ పరాన్నజీవికి హాని కలిగించవు. ఈ పరాన్నజీవులు సాల్మన్ చేపల గుంపులో కనిపిస్తాయి. తన చుట్టూ చేపలు సజీవంగా ఉన్నంత కాలం అవి జీవిస్తూ ఉంటాయి.



పరిశోధన సమయంలో శాస్త్రవేత్తలు మైక్రోస్కోప్ తో ఈ జీవిని గమనించినప్పుడు, వారికి అందులో మైటోకాన్డ్రియల్ డీఎన్ఏ కనిపించలేదు. దీని తర్వాత ఇది ప్రపంచంలోనే మొదటి జీవి అని స్పష్టమైంది. ఈ జీవి మానవులకు లేదా ఇతర జీవులకు అస్సలు హాని కలిగించదు. అయినప్పటికీ, ఆక్సిజన్ లేకుండా జీవించగలిగే అటువంటి జీవి భూమిపై ఎలా ఉద్భవించిందో ఇప్పటికీ మిస్టరీగానే ఉంది. ఈ పరాన్నజీవి మరొక లక్షణం ఏమిటంటే ఇది స్వచ్ఛమైన నీటితోపాటు ఉప్పు నీటిలో కూడా జీవించగలదు. అందుకే దీనిని మైక్సోజోవాన్ అంటారు.

# అట్లీ`అల్లు అర్జున్ కాంబోపై భారీ అంచనాలు



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మరియు మాస్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'ఎఎ22'పై అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఇప్పటికే ఈ సినిమా సౌత్‌తో పాటు నార్త్ ఇండియాలోనూ భారీ హైప్‌ను క్రియేట్ చేసింది. అయితే ఇప్పటివరకు ఈ చిత్రానికి సంబంధించిన ఎలాంటి అధికారిక ప్రమోషనల్ కంటెంట్ విడుదల చేయకుండా మేకర్స్ గట్టి సీక్రసీని మెయింటైన్ చేస్తున్నారు. ఇటీవల అట్లీ తన సోషల్ మీడియాలో షేర్ చేసిన లయన్ పోస్టర్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఆ పోస్టర్‌లో సింహం ముఖం రెండు వేర్వేరు భాగాలుగా కనిపించడం విశేషం. దీనితో సినిమాలో అల్లు అర్జున్ డ్యూయల్ రోల్‌లో కనిపించనున్నారా? లేక ఒక క్లిష్టమైన, మల్టీ`లేయర్డ్ క్యారెక్టర్‌లో నటిస్తున్నారా? అన్న సందేహాలు అభిమానుల్లో మొదలయ్యాయి. అట్లీ పోస్టర్‌కు జతచేసిన 'నీలా ఎవరూ ఉండలేరు, అదే నీ శక్తి' అనే క్యాప్షన్ మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇది హీరో పాత్రలో ఉన్న విభిన్న కోణాలను సూచిస్తోందని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ సుమారు రూ.600 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తోంది. ఈ స్థాయి వ్యయంతో రూపొందుతున్న ఈ సినిమా భారతీయ సినిమా చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలిచే అవకాశముంది. అల్లు అర్జున్ ఇప్పటికే పాన్`ఇండియా స్టార్‌గా తన స్థాయిని నిరూపించుకోగా, అట్లీ తన మాస్ కమర్షియల్ టేకింగ్‌తో వరుస విజయాలు అందుకున్న దర్శకుడు. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో,
ట్రేడ్ వర్గాలు ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు పెట్టుకున్నాయి.
బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు సృష్టించడం ఖాయ... భావిస్తున్నారు. అల్లు అర్జున్ పుట్టినరోజు సందర... 8న ఈ చిత్రానికి సంబంధించిన టీజర్ విడు... అవకాశముందని సమాచారం. దీనిపై ... రావాల్సి ఉన్నప్పటికీ,
అభిమానులు మాత్రం ఆ తేదీ...

# చిన్నప్పుడు ఆ సమస్యకు థెరపీ తీసుకొన్నా: సమీరా రెడ్డి

ఏ విషయం గురించైనా మాట్లాడుతూ ప్రశంసలు అందుకుంటుంటారు నటి సమీరా రెడ్డి. తాజాగా ఆమె తన చిన్నతనంలో ఎదుర్కొన్న వేధింపుల గురించి ఒక ఇంటర్వ్యూలో మాట్లాడారు. ముఖ్యంగా నత్తి కారణంగా తాను ఎదుర్కొన్న అవమానాలు తన ఆత్మవిశ్వాసాన్ని ఎలా దెబ్బతీశాయో వివరించారు. ''నేను చిన్నప్పుడు నత్తి సమస్యతో పెరిగాను. దానివల్ల చాలా వేధింపులకు గురయ్యాను. ఆత్మవిశ్వాసాన్ని తిరిగి పొందేందుకు నాకు ఎన్నో ఏళ్లపాటు థెరపీ అవసరమైంది. ఇప్పటికీ నేను మాట్లాడేటప్పుడు తడబడితే, ఎవరైనా వింతగా చూస్తే అది నన్ను ఎంతగానో బాధ పెడుతుంది. చిన్నప్పుడు మనపై వేసే ముద్ర మన మనసులో ఎంత బలంగా నాటుకుపోతాయో చెప్పడానికి ఇదే నిదర్శనం. పిల్లలను మనం పిలిచే విధానం కూడా వారిపై ప్రభావం చూపుతుంది. వారిపై వేసే చిన్నపాటి ముద్రలు కూడా వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. తాము వెనకబడినవాళ్లమని పదేపదే వినడం వల్ల పిల్లలు కొత్త విషయాలను నేర్చుకోవడానికి భయపడతారు. ఆ అపనమ్మకం వారి వ్యక్తిత్వాన్ని మారుస్తుంది. చివరికీ తాము ఏం చేయలేమనే భావనకు వచ్చేస్తారు. ఇది వారి భవిష్యత్తును ఎంతో ప్రభావితం చేస్తుంది'' అని సమీర అన్నారు. ''ఒక్క విషయంలో వెనకబడి ఉన్నంతమాత్రాన అది మన వ్యక్తిత్వాన్ని నిర్ణయించదని నేను నా పిల్లలకు చెబుతుంటాను. పిల్లలకు ప్రోత్సాహం, మద్దతు లభించినప్పుడు వారిలో సహజంగానే పట్టుదల పెరుగుతుంది. విమర్శలకు బదులుగా మద్దతును అందించినప్పుడే వారు సవాళ్లను నేర్చుకోవడానికి ఒక అవకాశంగా చూస్తారు'' అని సమీర వివరించారు.





# పెద్ది టీజర్ కోసం అభిమానుల ఆసక్తి




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న తాజా చిత్రం 'పెద్ది' పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాలో చరణ్ రఫ్ అండ్ మాస్ పాత్రలో కనిపించబోతున్నాడు. ఇటీవల విడుదలైన ఈ సినిమా రెండో సింగిల్ 'రై రై రా రా' సోషల్ మీడియాలో సంచలనం సృష్టించగా.. ముఖ్యంగా రామ్ చరణ్ ఎనర్జిటిక్ డ్యాన్స్ మూమెంట్స్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. మరోవైపు ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. ప్రస్తుతం గచ్చిబౌలి స్టేడియంలో క్రూషియల్ షెడ్యూల్‌తో బిజీగా ఉంది చిత్ర యూనిట్. నాలుగు రోజుల పాటు ఈ షెడ్యూల్ షూటింగ్ జరగనుందని సమాచారం. ఇక పెద్ది సినిమా నుంచి టీజర్ రిలీజ్‌కు రెడీ అవుతున్నారు మేకర్స్. అఫీషియల్ కన్ఫర్మేషన్ లేకపోయినా, రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా మార్చి 27న పెద్ది టీజర్ విడుదలయ్యే అవకాశం ఉంది. అయితే, చరణ్ బర్త్ డేకి మరో మూడు రోజుల సమయం మాత్రమే ఉంది. కానీ, ఇప్పటి వరకు పెద్ది టీమ్ నుంచి టీజర్ గురించి ఎలాంటి అప్డేట్ లేదు. మెగాభిమానులు మాత్రం ఈసారి తమ అభిమాన హీరో బర్త్ డేని గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకోబోతున్నారు. మార్చి 26 సాయంత్రం నుంచి హైదరాబాద్ శిల్పకళా వేదికలో గ్రాండ్ ఈవెంట్ లాన్ చేస్తున్నారు. ఈ వేడుకకు రామ్ చరణ్ అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని

## శ్రీలీల ట్రాక్ చూసేందుకు
# మహిళల ఆసక్తి

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ కథానాయకుడిగా దర్శకుడు హరీశ్ శంకర్ తెరకెక్కించిన చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ'. తాజాగా దీని ప్రచారంలో భాగంగా హరీశ్ శంకర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సినిమాకు వస్తున్న స్పందనపై ఆయన మాట్లాడుతూ.. సెకండ్ హాఫ్‌లో వచ్చే శ్రీలీల ఎపిసోడ్ మహిళా ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోందని తెలిపారు. 'నిజం చెప్పాలంటే.. రెండో భాగంలో శ్రీలీల ట్రాక్ చూడటం కోసమే మహిళలు భారీగా థియేటర్లకు వస్తున్నారు. పవన్ కల్యాణ్‌ను రెండు గంటల పాటు అభిమానులు వారు కోరుకున్న విధంగా చూసుకోదగ్గ చిత్రమిది. కుటుంబ ప్రేక్షకులందరూ కలిసి ఆస్వాదించేలా ఉంది. నేను ఈ చిత్రం విషయంలో చాలా సంతోషంగా ఉన్నాను' అని అన్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ మూవీలో పవన్‌కు జోడీగా శ్రీలీల, రాశీఖన్నా నటించగా.. పార్తీబన్ విలన్ పాత్రలో కనిపించారు.




The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.